


# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి ఆదివారం 31 అక్టోబరు 2021 సంపుటి : 03 సంచిక : 77 పేజీలు : 4 వెల : రూ 3-00


## ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి గవర్నర్ ఘనస్వాగతం



కృష్ణా: ఆంధ్రప్రదేశ్‌లో వారం రోజుల పర్యటనలో భాగంగా విజయవాడ గన్నవరం విమానాశ్రయానికి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేరుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, డీజీపీ గౌతమ్ సవాంగ్, మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కి ఉపరాష్ట్రపతి బయలుదేరారు. కాగా నేటి నుంచి వారం రోజుల పాటు రాష్ట్రంలో వలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొనున్నారు. ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని జేసీ వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉపరాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పొరపాటు కూడా లేకుండా రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు సమన్వయంతో విధులను నిర్వహించాలన్నారు. విధులను నిర్వహించే వారందరికీ కరోనా పరీక్షలు తప్పనిసరిగా చేయించాలన్నారు. ఉపరాష్ట్రపతి మంగళవారం గన్నవరం విమానాశ్రయం చేరుకుని అక్కడ నుంచి సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి చేరుకుంటారు. అక్కడే జరిగే ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో పాల్గొంటారన్నారు. పోర్ట్ గెస్ట్ హౌస్‌లో జరిగే 61వ నేషన్ డిఫెన్స్ కాలేజ్ కోర్స్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. 3,4,5 తేదీల్లో నగరంలోని వివిధ కార్యక్రమంలో పాల్గొని 6వ తేదీ సాయంత్రం ఎయిర్‌పోర్టుకు చేరుకుని పాట్నా వెళతారని తెలిపారు. సమావేశంలో డీఆర్వో శ్రీనివాస మూర్తి, ఆర్డీవో పెంచల కిషోర్, డీఆర్డీఏ పీడీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

## ఏఐటీటీ టాపర్స్‌కు సీఎం జగన్ అభినందనలు



అమరావతి: ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్ (ఏఐటీటీ)?2020లో క్రాఫ్ట్‌మెన్ ట్రైనింగ్ స్కీమ్ (సీటీఎస్) జాతీయ స్థాయి పరీక్షలో టాప్ ర్యాంకులు సాధించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారిని అభినందిస్తూ ఒక్కో విద్యార్థికి రూ.5 లక్షల నగదు ప్రోత్సాహం, వారి చదువుకు అనుగుణంగా ఏపీఐఐసీలో ఉద్యోగాన్ని ప్రకటించారు. వారికి మెమెంటోలతో పాటు సర్టిఫికెట్‌లు, ట్యాబ్‌లను అందజేశారు. ఇదిలా ఉండగా కౌశలాచార్య అవార్డు? 2021ని సాధించిన డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్ వై.రజిత ప్రియను కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభినందిస్తూ రూ.5 లక్షల ప్రోత్సాహం ప్రకటించారు.

### ఒక్కో విద్యార్థికి రూ.5 లక్షలు ప్రోత్సాహం
### మెమెంటో, సర్టిఫికెట్, ట్యాబ్స్ అందజేత
### చదువుకు అనుగుణంగా ఏపీఐఐసీలో ఉద్యోగం

వీరందరికీ పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి మంగళగిరి ఏపీఐఐసీ ప్రధాన కార్యాల యంలో రూ.5 లక్షల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ లావణ్య వేణి, రీజనల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, జాయింట్ డైరెక్టర్ జి.బాలసుబ్రహ్మణ్యం, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## రాజకీయ సన్యాసం చేస్తా: శిల్పా చక్రపాణిరెడ్డి

కర్నూలు: వర్ధన్ బ్యాంకులో ఒక్క రూపాయి తీసుకున్నట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తానని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రకటించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వర్ధన్ బ్యాంకులో ఒక్క రూపాయి వాటా లేదని తెలిపారు. వాటా ఉన్నట్లు నిరూపిస్తే గొంతు కోసుకుంటానని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మాటలకు విలువ లేదని చెప్పారు. హత్యా రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ బుడ్డా వంశమని శిల్పా చక్రపాణిరెడ్డి ధ్వజమెత్తారు.

## బద్వేలు ఉప ఎన్నిక ని పరిశీలించిన సీఈవో

అమరావతి బద్వేల్ ఉపఎన్నిక ప్రక్రియను అమరావతి సచివాలయం లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నుండి వెబ్ కాస్టింగ్ ద్వారా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కె. విజయానంద్ పరిశీలించారు. శనివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రశాంతంగా సాగుతున్నది అన్నారు. ఉదయం 9 గంటల వరకు 10.49 ఓట్లు నమోదు అయినట్లుగా వెల్లడించారు. అన్ని పోలింగ్ స్టేషన్లో ఉదయం 7 గంటలకే మాక్ పోల్ నిర్వహించడం జరిగిందని, మూడు చోట్ల ఈవీఎంలు పని చేయక పోవడాన్ని గుర్తించి వెంటనే వాటిని మార్చి వేయడం జరిగింది అన్నారు. స్థానికంగా ఏమైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే రాజకీయ నాయకులు వాటిని అధికారుల దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరించడం జరుగుతున్నదని తెలిపారు. ఈ ఓటింగ్ ప్రక్రియ ను 24 మంది అధికారులు పరిశీలిస్తున్నారని, ఇప్పటివరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లు తమ దృష్టికి రాలేదని తెలిపారు. నియోజవర్గం సరిహద్దులు అన్ని పూర్తిగా మూసివేయడం జరిగిందని బస్సులలో తరలింపుకు ఎటువంటి ఆస్కారం లేదని ఆయన తెలిపారు.

## పోప్ ఫ్రాన్సిస్‌ను భారత్‌కు ఆహ్వానించిన మోదీ



రోమ్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కేథలిక్ చర్చ్ అధిపతి పోప్ ఫ్రాన్సిస్‌ను భారత దేశానికి ఆహ్వానించారు. వీరిద్దరూ శనివారం అత్యంత ఆత్మీయంగా సమావేశమయ్యారు. వాతావరణ మార్పులు, పేదరికం వంటి వివిధ అంశాలపై చర్చించారు. షెడ్యూలు ప్రకారం 20 నిమిషాలు జరగవలసిన ఈ భేటీ గంటపాటు జరిగినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. నరేంద్ర మోదీ శనివారం ఇచ్చిన ట్వీట్‌లో, తాను పోప్ ఫ్రాన్సిస్‌తో అత్యంత ఆత్మీయంగా సమావేశమైనట్లు తెలిపారు. ఆయనతో అనేక అంశాలను చర్చించే అవకాశం లభించిందని పేర్కొన్నారు. ఆయనను భారత దేశానికి ఆహ్వానించానని తెలిపారు. 1999లో పోప్ జాన్ పాల్-2 భారత దేశంలో పర్యటించారు. అప్పట్లో అటల్ బిహారీ వాజ్‌పాయి ప్రధాన మంత్రిగా ఉన్నారు. ఆ తర్వాత కేథలిక్ చర్చ్ అధిపతి మన దేశంలో పర్యటించలేదు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తాజాగా పోప్ ఫ్రాన్సిస్‌ను ఆహ్వానించారు. జీ20 సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఇటలీ వెళ్ళిన సంగతి తెలిసిందే. ఆయనతోపాటు విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఉన్నారు.

## మహా పాదయాత్రకు టీడీపీ మద్దతు : దేవినేని




అమరావతి మహా పాదయాత్ర కు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. 683 రోజులుగా మీరు చేస్తున్న పోరాటం స్వాతంత్ర్య పోరాటం తరువాత అంతటి గొప్ప పోరాటం. రాష్ట్ర ప్రయోజనాల కోసం మూడు పంటలు పండే భూములు ఇచ్చారు ఆ రోజు ఒక్క పిలుపు ఇస్తే ఎటువంటి డబ్బులు తీసుకోకుండా ఆనందంతో భూములు ఇచ్చారు. మహిళలు దేవాలయలకు వెళ్తుంటే పెట్టిన ఆంక్షలు. ఒక భయానికి వాతావరణం తీసుకురావడానికి ఇటువంటి నిర్ణయలు తీసుకుంటున్నారు. రాష్ట్రాన్ని నాశనం చేయడానికి ఇటువంటి చర్యలకు పాల్పడ్డారు. మీరు చేయబోయే ఈ పాదయాత్ర చరిత్రలో నిలుస్తుంది. పాద యాత్ర ఆపాలని చూసినా న్యాయస్థానం కాపాడింది. న్యాయస్థానం లేకపోతే ఈ దుర్మార్గులు ఎవరిని కూడా బ్రతకనివ్వరు. కేంద్ర రాష్ట్ర డబ్బులు 10 వేల కోట్లు ఖర్చుబెట్టబడి ఉన్నాయి. వేలాది హెక్టార్లలో భవనాలు నిర్మించబడి ఉన్నాయి. ఈ రోజు ఈ అమరావతిలో ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా ఉన్నారు. రైతుల మీద తప్పుడు కేసులు పెడుతున్నారు. ఒక ముఖ్యమంత్రి క్యాబినేట్ కి వెళ్ళాలంటే పోలీసులను పెట్టుకొని వెళ్లడం సిగ్గుచేటని అన్నారు. మీ పాద యాత్ర సమయంలో ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త మీకు అండగా ఉంటాడు. నేలపాడు న్యాయస్థానం నుంచి మీ పాదయాత్ర ప్రారంభ అవ్వడం చాలా శుభపరిణామం. మహిళలు అని కూడా చూడకుండా వారి మీద దాడులు చేయడం చాలా దుర్మార్గం. మీ పాదయాత్ర లో ప్రతి ఒక్కరు కూడా భాగస్వామ్యం అవుతాము. మహిళలు తలుచుకుంటే ఏమైనా సాధిస్తారు. అమరావతి అనేది ఒక చరిత్ర. ఎవరు కూడా అడ్డుకోలేరని అయన అన్నారు.

### జీవీఎంసీ కమిషనర్‌గా డాక్టర్ లక్ష్మీశ

విశాఖపట్నం: జీవీఎంసీ నూతన కమిషనర్‌గా డాక్టర్ లక్ష్మీశ పదవీ భాద్యతలను చేపట్టారు. నూతన కమిషనర్‌కు జీవీఎంసీ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాఖ సుందరమైన నగరమన్నారు. ఈ నగరం లో పనిచేయడానికి అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. నగర ప్రజలు, జీవీఎంసీ సిబ్బంది ,అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తానన్నారు. విశాఖను అభివృద్ధి పథంలో నడిపించ డానికి తన వంతు కృషి చేస్తానన్నారు. నగనరంలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని కమిషనర్ లక్ష్మీశ తెలిపారు.



## అరెస్ట్ చేస్తే ఒంటిమీద చేయి వేయకూడదు: ఎంపీ రఘురామ



ఢిల్లీ: సీబీఐలో ఏ ఆఫీసర్ ఎక్కడ ఉండాలో విజయసాయి చూస్తున్నారని ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. సీబీఐ, ఈడీ అధికారులతో విజయసాయి నిరంతరం మంతనాలు చేస్తున్నారని చెప్పారు. సీబీఐ లాయర్‌గా సుభాష్ నియామకం వెనుక విజయసాయి పాత్ర ఉందన్నారు. సీబీఐ, ఈడీ కేసుల్లో అనుకూల అధికారుల నియామకం జరిగేలా విజయసాయి చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పోలీసులు ఎవరినైనా అరెస్ట్ చేస్తే ఒంటిమీద చేయి వేయకూడదన్నారు.

## రామాలయం ఎందుకు అని అడిగినవాళ్ళే పూజలు చేస్తున్నారు : అనురాగ్ ఠాకూర్

అయోధ్య : రామాలయం అవసరం ఏముందని ప్రశ్నించినవాళ్ళే ఇప్పుడు అక్కడ పూజలు చేస్తున్నారని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. రామాలయాన్ని నిర్మిస్తామని తాము ఇచ్చిన హామీని నెరవేర్చామని చెప్పారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాన్ని ప్రక్షాళన చేశారని శనివారం ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ చెప్పారు. రామాలయాన్ని నిర్మిస్తామని తాము ప్రజలకు హామీ ఇచ్చామని, దానిని నెరవేర్చామని చెప్పారు. రామాలయం అవసరం ఏముందని గతంలో ప్రశ్నించినవాళ్ళు ఇప్పుడు అక్కడ పూజలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాన్ని ప్రక్షాళన చేశారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతి రహితంగా నడుస్తోందన్నారు. రాష్ట్రంలో గూండారాజ్‌ను అంతం చేశారన్నారు. రానున్న శాసన సభ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమని చెప్పారు. ఉత్తర ప్రదేశ్‌లో మొత్తం 403 శాసన సభ నియోజకవర్గాలు ఉన్నాయి. శాసన సభ ఎన్నికలు వచ్చే ఏడాది ప్రారంభంలో జరుగుతాయి. 2017లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో బీజేపీకి 39.67 శాతం ఓట్లు, 312 స్థానాలు లభించాయి.




## ముగిసిన ఉపఎన్నిక పోలింగ్



బద్వేలు : వేల్ ఉప ఎన్నిక పోలింగ్ ముసిగింది. క్యూలైన్లో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. సాయంత్ర ఐదు గంటల వరకు బద్వేల్‌లో 59.58 శాతం పోలింగ్ నమోదయ్యింది. 281 కేంద్రాల్లో పోలింగ్ కొనసాగింది. బద్వేల్ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతుంది. సాయంత్రం 5 గంటల వరకు బద్వేల్‌లో 59.58 శాతం పోలింగ్ నమోదయ్యింది. రాత్రి 7 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. బద్వేల్ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతుంది. మధ్యాహ్నం 3 గంటల వరకు బద్వేల్‌లో 44.82 శాతం పోలింగ్ నమోదయ్యింది. బద్వేల్ ఉప ఎన్నికను వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు సీఈఓ విజాయనంద్. రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి విజయానంద్ పర్యవేక్షిస్తున్నారు. బద్వేల్ ఉప ఎన్నిక ప్రశాంతంగా జరుగుతుంది అన్నారు. ఇప్పటివరకు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని తెలిపారు. దొంగ ఓటర్లను తరలిస్తున్నారన్నది అబద్ధం అని విజయానంద్ తెలిపారు. బద్వేల్ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు 35.47 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 9 గంటల వరకు 10.49 శాతం పోలింగ్ నమోదు అవ్వగా, ఉదయం 11 గంటల వరకు 20.89 శాతం పోలింగ్ నమోదైంది. బద్వేల్ ఉప ఎన్నికను వెబ్ కాస్టింగ్ ద్వారా రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి సీఈవో విజయానంద్ పర్యవేక్షిస్తున్నారు. బద్వేల్‌లో ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోంది. దొంగ ఓటర్లను తరలిస్తున్నారంటూ కొన్ని ఛానల్‌లో అవాస్తవ కథనాలు ప్రచారం అవుతున్నాయి. కథనాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కె.విజయానంద్ స్పందించారు. దొంగ ఓటర్లను తరలిస్తున్నారన్నది అబద్ధమని తెలిపారు. ఇప్పటివరకు అలాంటి ఫిర్యాదులేమీ అందలేదన్నారు.

## రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు: చంద్రబాబు

చిత్తూరు: రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. సామగుట్టపల్లిలో చంద్రబాబు రోడ్‌షో నిర్వహించారు. పొలాల్లో రైతుల దగ్గరకెళ్లి వారి సమస్యలను చంద్రబాబు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దతు ధరలేక వరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రైతుకు గిట్టుబాటు ధర కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే రైతుకు మద్దతు ధర కల్పిస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. చంద్రబాబు రాక కుప్పం టీడీపీ శ్రేణుల్లో అమితోత్సాహం నింపింది. ఆయన రోడ్‌షో, బహిరంగ సభకు భారీఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దొరబాబు, పాలకొల్లు ఎమ్మెల్యే రామానాయుడు తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి పలువురు కార్యకర్తల కుటుంబాలను చంద్రబాబు పరామర్శించారు. శనివారం కూడా ఆయన పర్యటన కొనసాగుతుంది.



# సంపాదకీయం

ఆదివారం 31 అక్టోబరు 2021

## కులగణనకు పెరుగుతున్న డిమాండ్

దేశంలో జనగణనకు శతాబ్దన్నరకు పైగానే చరిత్ర ఉన్నది. పన్నుల వసూళ్ల కొరకు బ్రిటిష్ వాళ్లు జనాభా లెక్కల సేకరణను 1866లో మొదలు పెట్టారు. వాళ్ల ప్రయోజనాల కోసమే అయినా కులాలవారీ జనగణన పద్ధతిని 1931 వరకు కొనసాగించారు. జనాభా లెక్కల్లో కులాల లెక్కింపు చివరి సారిగా అప్పుడే జరిగింది. దేశంలో వివిధ రకాల సామాజిక శ్రేణుల సంక్షేమం కోసం అమలవుతున్న పథకాలు, రాజ్యాంగ నిర్మాణాంతరం అమలవుతున్న రిజర్వేషన్లు గత 90 ఏళ్లనాటి కులాల డేటా ప్రాతిపదికనే అమలవుతున్నవి. దీనికి షెడ్యూల్డ్, కులాల్డ్ తెగల గణన మినహాయింపు, వారికి జనాభా ఆధారంగా రిజర్వేషన్లు అమలు జరపాలన్న రాజ్యాంగ నియమావళిని అనుసరించి వారి జనగణన జరుగుతున్నది. అయితే బిసి కులాల జనగణన చేయకూడదన్ననిబంధనలు రాజ్యాంగంలో ఏమీ లేవు.దేశంలో 1931 నాటి లెక్కల ఆధారంగానే బిసి కులాలు 62 శాతం పైగా ఉన్నట్టు మండల్ కమిషన్ తేల్చింది. అసలు జనాభా లెక్కలు అంటే యాంత్రికంగా మనుషులను నిలబెట్టి తలలు లెక్కించడం కాదు. మొత్తం ఒక దేశ మానవ వనరుల నిర్ధారణ. దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక చిత్రణ. మానవ వనరులకు, వసతులకు మధ్య సమతూకం సాధించడానికి ఉపయుక్తమైన గొప్ప ప్రాతిపదికను జనగణన కార్యం ఏర్పరుస్తుంది. దేశంలో (ప్రతి పదేళ్లకు ఓ సారి జరిగే ఈ బృహత్తర కార్యక్రమానికి పాలనాపరమైన సుదీర్ఘ కసరత్తే ఉంటుంది. ఓ సంవత్సరం ముందే ఈ గణనకు సమాయత్తం కావాల్సి ఉన్నప్పటికీ ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న కరోనా ఉప్రదవం వల్ల ఈ సారి జనగణన ఓ సంవత్సరం పైగానే అనివార్యంగా ఆలస్యమైంది. అయితే ఆలస్యమే ఈసారి జనాభా లెక్కల ప్రత్యేకత కాదు.దేశ వ్యాప్తంగా కులాల ఆధారంగా జనగణన చేయాలనే డిమాండ్ ఊపందుకుంది. నిజానికి కులపరమైన గణాంకాలు సేకరించడానికి జనాభా సేకరణ పత్రంలోనే మరికొన్ని అంశాలు అదనంగా చేరిస్తే చాలు. ప్రభుత్వాలు ఆపని చేయలేక, వనరులు, యంత్రాం గం లేక కాదు గానీ గుట్టలు గుట్టలుగా వచ్చిపడిన ఆ సమాచారాన్ని క్రోడీకరించి ప్రజాక్షేత్రంలో బహిరంగ పర్చడానికే జంకుతున్నది. ఈ జంకుకు కారణాలు ఆ పనిలో ఇమిడి ఉన్న సంక్లిష్టత వల్ల కూడా కాదు. అనేక పార్టీలు, సామాజిక సంఘాలు కుల ఆధారిత జనగణనను తీవ్రంగా డిమాండ్ చేస్తున్నాయి. కులాలవారీ జనగణన చేయడానికి బిజెపి 2011 నాటి జనాభా లెక్కల సందర్భంలో బలంగా డిమాండ్ చేసి 2018లో అంగీకరించింది. కానీ తన ప్రభుత్వమే ఆ పని చేయాల్సి రావడాన్ని ఆహ్వానించలేకపోతుంది. సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్ లో పాలనాపరమైన చిక్కులు, సంక్లిష్టత ఎక్కువగా ఉంటుందని, కులగణన వివరాలు బయటికి చెప్పడం సున్నితమైన అంశమని చెబుతుంది. ఈ వాదనలో పాలనాపరమైన అంశాలను బయటికి చెప్పినా ఇవేవీ అసలు కారణాలు కావని రాజ్యాంగం పట్ల, సామాజిక న్యాయం భావన పట్ల, బిజెపి వైఖరి చూస్తే అర్థమవుతుంది. సంఘ్ పరివార్ అఖండ హిందూ భారత్ లక్ష్యానికి అనుగుణంగా రాజకీయ యంత్రాంగాన్ని నడుపుతున్న బిజెపి చెబుతున్నవన్నీ సాకులు మాత్రమే. కులగణన కులాన్ని మరింత వ్యవస్థీకృతం చేసి స్థిర పరుస్తుందని ఏదో కుల నిర్మూలన ఎజెండాను భుజాన వేసుకున్న స్థాయిలో మాట్లాడుతున్నారు. సామాజిక సత్యాలను దాయాలనడం ఏ ప్రయోజనాలనూ నెరవేర్చదు. కులాల ఆధారంగా జనాభా లెక్కలు జరిగితే రిజర్వేషన్ల పరిధిని 50 శాతానికి పైగా పెంచాలనే డిమాండ్ ఉధృతమవుతుంది. విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాల్లో మరింత ప్రాతినిధ్యం, పట్టుకోసం డిమాండ్ పెరుగుతుందనే అక్కసు కూడా ఈ కులగణన వ్యతిరేకత వెనుక ఉన్నది. ఈ దేశబహుజనుల తమ జీవుల సమస్తం అయిన ఈ సంపద పైన యాజమాన్యం ఎక్కడ చేజారిపోతుందో అన్న భయం కూడా ఈ డిమాండ్‌ను అడ్డుకుంటున్నది.2020 వ సంవత్సరంలో ఆక్స్‌ఫామ్ సంస్థ అందించిన నివేదిక ప్రకారం దేశ జనాభాలో 10 శాతం దగ్గర 74.3 శాతం సంపద, 40 శాతం జనాభా దగ్గర 22.9 శాతం మరో 50 శాతం జనాభాకి కేవలం 2.8 శాతం సంపద మాత్రమే ఉన్నది. పైన పేర్కొన్న పది శాతం జనాభా ఎవరో ఇట్టే అర్థమైపోతుంది. 1961 నుండి 2012 కాలం లో భారతదేశంలో సంపద, అసమానతలు, వర్గం, కులం గురించి ప్రపంచ అసమానతల డేటా పత్రం నుండి పరిగణనలోకి తీసుకుంటే సగటు గృహ ఆదాయం 1,193,222 రూపాయలు. దీనిలో ఉన్నత వర్గాల ఆదాయం 48 శాతం, ఇది జాతీయ సగటు కంటే అధికం. ఉన్నత వర్గాలది 46 శాతం అయితే షెడ్యూల్డ్ కులాల, తెగల వాటా 21 శాతం, 34 శాతంగా తేలింది. ఇది జాతీయ సగటు కంటే చాలా తక్కువ. ఇక ఒబిసిల ఆదాయం కేవలం 8 శాతం మాత్రమే. ఇక సంపద పైన యాజమాన్యం తీసుకుంటే బ్రాహ్మణులు 50 శాతం, రాజపుత్‌లు 31 శాతం, బనియాలు 44 శాతం, కాయస్తులు 57 శాతం సంపదతో ఈ వర్గాలో అత్యంత సంపన్నులుగా ఉన్నారు.ఉన్నత కులాలుగా ఉన్న వారి ఆదాయం 39 శాతం నుండి 41 శాతం అంటే 14 నుండి 18 శాతం పెరిగింది. దీనిని బట్టి సంపద అంతా ఏ ఏ కులాల మధ్య కేంద్రీకృతమై ఉందో అర్థం చేసుకోవచ్చు. 2018లో సావిత్రి ఫూలే యూనివర్శిటీ, పుణె, జెఎన్‌యు, దలిత్ స్టడీస్ సంస్థ జరిపిన సంపద, యాజమాన్యం, అసమానత, సామాజికపరమైన అధ్యయనంలో ఇలాంటి నిజాలే బయటపడ్డాయి.41 శాతం ఆదాయం ఉన్నత కులాల చేతుల్లో 31 శాతం ఒబిసిలు, 3.7 శాతం షెడ్యూల్డ్ కులాలు, 7.6 శాతం షెడ్యూల్డ్ తెగల చేతుల్లో సంపద ఉన్నట్టు తేలింది. ఇంతటి అసమానతలు ఇప్పటికీ ప్రబలంగా ఉన్నప్పుడు, వాటిని పూరించి, సామాజిక వికాసం పెంచాల్సిన సందర్భంలో కూడా సరైన కుల జనాభా గణన జరగకుండా నిర్దిష్ట చర్యలు చేపట్టడం అసాధ్యం. ఓ వైపు ఒబిసిని ప్రధానిని చేశామని గొప్పగా చెప్పుకుంటున్న బిజెపి అదే ఒబిసిల లెక్కలు వద్దంటున్నది.

# మాజీ వర్సెస్ ప్రెజెంట్

### టీడీపీలో తన్నులాటలు

శ్రీకాకుళం, అక్టోబరు 30, (న్యూస్ పల్స్)అచ్చెన్నాయుడు.. ఏపీ టీడీపీ అధ్యక్షుడు. కళా వెంకట్రావు.. ఏపీ టీడీపీ మాజీ అధ్యక్షుడు. ఇద్దరూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారే. పైకి నవ్వుతూ కనిపించినా.. ఇద్దరి మధ్య కోల్డ్ వార్ ఉందన్నది పార్టీలో అందిరికీ తెలిసిందే. కళా వెంకట్రావును ఇబ్బంది పెట్టేందుకు అచ్చెన్న సర్వశక్తులు ఒడ్డుతున్నారని జిల్లాలో హాట్ హాట్ డిస్కషన్స్ నడుస్తున్నాయి. దీనికి కారణం లేకపోలేదు. కొంతకాలంగా ఎచ్చెర్లలో కళాకు వ్యతిరేకంగా ఉన్న కొందరు చోటామోటా లీడర్లను అచ్చెన్న ఎంకరేజ్ చేస్తున్నారట. అచ్చెన్న ఎంకరేజ్ చేస్తున్నవారిలో టీడీపీ నుంచి బహిష్కరణ వేటుపడ్డవాళ్లు కూడా ఉన్నారట.ఇటీవల జిల్లాలో అధికారులకు వినతి పత్రాలు సమర్పించే కార్యక్రమంలో పార్టీ నుంచి బహిష్కరించిన ఓ నాయకుడు అచ్చెన్నతో రాసుకుని పూసుకుని తిరిగారట. అది చూసి పార్టీ నేతలు ఆశ్చర్యపోయారు. ఆ వ్యక్తి టీడీపీ బ్యానర్‌పైనే కార్యక్రమాలు చేపడుతున్నారట. దీంతో అతడికి టీడీపీ సంబంధం లేదని అప్పట్లో ప్రకటన జారీ చేశారు. అయినా అతను ఆగడం లేదట. ఇప్పుడు అచ్చెన్నతో అంటకాగడంతో చర్చగా మారింది. కళా వెంకట్రావు విషయంలోనే ఇలా చేస్తే.. ఇక తమలాంటి వారి పరిస్థితి ఏంటని తమ్ముళ్లు చెవులు కొరుక్కుంటున్నారట.ఇటీవల చంద్రబాబు చేపట్టిన 36 గంటల దీక్షకు ఆ బహిష్కృత నేత హాజరయ్యాడు. చంద్రబాబుకు 50 వేలు విరాళంగా ఇచ్చారట. అయితే ఆ నేతను ఎవరూ గుర్తు పట్టకుండా ఉండేందుకు మాస్క్ ధరించి వేదిక మీదకు వచ్చేలా ప్లాన్ చేశారట. దీనికి కూడా అచ్చెన్న అండదండలు ఉన్నట్టు జిల్లాలో టాక్. పార్టీ నుంచి బహిష్కరించిన వ్యక్తిని ఏకంగా టీడీపీ ఆఫీస్‌లోకి తీసుకురావడం.. చంద్రబాబు దీక్షా వేదిక దగ్గరకు పంపడం మామూలు విషయం కాదని అనుకుంటున్నారు. ఈ ఎపిసోడ్‌లో మరో కొసమెరుపు కూడా ఉంది. అమరావతి నుంచి శ్రీకాకుళానికి తిరిగి వెళ్లాక ఆ బహిష్కృత నేత మరింత రెచ్చిపోతున్నారట. వచ్చే ఎన్నికల్లో ఎచ్చెర్ల టికెట్ కళాకు కాకుండా తనకే వస్తుందని ఓపెన్‌గానే ప్రచారం చేసుకుంటున్నట్టు సమాచారం. దాంతో అచ్చెన్న, కళా వెంకట్రావుల మధ్య ఈ వర్గపోరు ఎక్కడికి దారితీస్తుందో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు తమ్ముళ్లు.

## మత్తు రాజకీయాల్లోకి జనసేనా

విజయవాడ, అక్టోబరు 30, (న్యూస్ పల్స్)మత్తు రాజకీయంలోకి జనసేన కూడా ఎంటరైందా? ఇరికించామని టీడీపీ.. కౌంటర్ ఇచ్చామని అధికార పార్టీ అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా తెర మీదకు వచ్చారు జనసేనాని. పొలిటికల్‌గా అడ్వాంటేజ్ తీసుకునే ప్రయత్నం చేశారా? లేక చంద్రబాబు మనిషిగానే పవన్ కల్యాణ్ కామెంట్స్ పాస్ చేశారా?ఏపీలో రాజకీయం మత్తులో జోగుతోంది. ఉదయం లేచింది మొదలు అధికార పార్టీ.. ప్రతిపక్ష టీడీపీ.. డ్రగ్స్.. హెరాయిన్.. గంజాయి అంటూ మాటల తూటాలు పేల్చుకుంటున్నాయి. ఈ ఎపిసోడ్‌లోకి జనసేన కూడా ఎంట్రీ ఇచ్చింది. నెలన్నరగా గంజాయి.. డ్రగ్స్‌లపై పెద్దఎత్తున రాజకీయం నడుస్తోన్నా.. అంతగా స్పందించని జనసేనాని.. చంద్రబాబు ఢిల్లీ నుంచి తిరిగి వచ్చాక గేర్ మార్చారు. కిక్కిచ్చే పొలిటికల్ గేమ్ షోలోకి వచ్చేశారు. వరస ట్వీట్లు.. ఇటీవల కాలంలో వివిధ రాష్ట్రాల్లో పోలీసులు పట్టుకున్న గంజాయిని.. దాని మూలాలను వివరిస్తోన్న అధికారుల వీడియో క్లిప్పింగులను ట్విటర్‌లో జతపరిచి ఒకదాని వెనక ఒకటిగా విడుదల చేస్తున్నారు.ఈ వరస ట్వీట్స్‌లో ఓ ఆసక్తికర పరిణామం. 2018లో తాను యాఃలోని గిరిజన తండాలలో పోరాట యాత్ర చేసిన సందర్భంలో గంజాయి సాగు.. రవాణా అంశాలు ప్రస్తావనకు వచ్చాయని పవన్ కల్యాణ్ తెలిపారు. అంటే ఏపీలో గంజాయిసాగు ఇప్పుడే పుట్టుకొచ్చిన వ్యవహారం కాదు. గతం నుంచి ఉంది. కాకపోతే మరింతగా పెరిగిందనే అర్థం వచ్చే రీతిలో ట్వీట్స్ చేశారు పవన్. వైసీపీ.. టీడీపీలను ఇరకాటంలోకి నెట్టేలా పవన్ ట్వీటర్ రాజకీయం చేస్తున్నారని చర్చ జరిగింది. గంజాయిని అరికట్టే విషయంలో రెండు పార్టీలు దొందూ దొందేననే ఎస్టాబ్లిష్ చేస్తున్నారని అనుకుంటున్నారు.ఇదే అంశంపై వైసీపీ-టీడీపీల్లో కూడా చర్చ జరిగింది. గంజాయిపై ట్వీట్ చేస్తే చేశారు.. 2018 ప్రస్తావన ఎందుకు తెచ్చారని.. టీడీపీ గింజుకుంటోందట. టీడీపీ హయాంలో గంజాయి సరఫరా.. సాగు విషయంలో నాటి మంత్రులు గంటా శ్రీనివాస్, అయ్యన్న చేసిన కామెంట్స్‌ను ఇప్పుడు సోషల్ మీడియాలో తిరుగుతున్నాయి. అవి టీడీపీకి డామేజ్ చేసే విధంగా ఉన్నాయని ఆందోళన చెందుతుంటే.. ఇదే సమయంలో పవన్ కల్యాణ్ దాన్ని మరింత బలపరిచే రీతిలో ట్వీట్స్ చేయడం వల్ల మరింత చిక్కుల్లో పడతామని టీడీపీ నేతలు ఆందోళన చెందుతున్నారట. మరోవైపు 2018 అంశాన్ని ఏదో తూతూ మంత్రంగా ప్రస్తావించారు తప్ప.. తమను.. తమ ప్రభుత్వాన్ని టార్గెట్ చేసేలా పవన్ ట్వీట్స్ ఉన్నాయని వైసీపీ నేతలు అభిప్రాయపడుతున్నారట. పవన్‌లో చిత్తశుద్ధి ఉంటే.. గతంలో నాటి మంత్రులు గంటా, అయ్యన్నలు చేసిన కామెంట్స్‌ను కూడా ట్వీట్ చేయొచ్చు కదా అని ప్రశ్నిస్తున్నారట. ఏది ఏమైనా.. జనసేనాని.. టీడీపీ గూటి పక్షేననే విషయం అందరికీ తెలుసంటున్నారు వైసీపీ నేతలు

## నెల్లూరు జిల్లాలో భారీ ఫర్నిచర్ పార్కు

నెల్లూరు,అక్టోబరు 30 (న్యూస్ పల్స్) దేశీయ అవసరాలకు తోడు ఎగుమతులే లక్ష్యంగా రాష్ట్రంలో భారీ ఫర్నిచర్ పార్కు ఏర్పాటు కానుంది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో, శ్రీ సిటీకి సమీపంలో 1,500 ఎకరాల్లో ఫర్నిచర్ పార్కును నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా సుమారు 20 రకాల వస్తువులకు సంబంధించి దిగుమతులను తగ్గించుకుని ఎగుమతి చేసే విధంగా స్వయం సమృద్ధి సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో భాగంగా ఏపీలో ఫర్నిచర్ పార్కు ఏర్పాటు కానుంది. అంతర్జాతీయంగా ఏటా రూ. 20 లక్షల కోట్ల విలువైన ఫర్నిచర్ విక్రయాలు జరుగుతుండగా ఇందులో కనీసం రూ.3?4 లక్షల కోట్ల విలువైన మార్కెట్‌ను భారత్ దక్కించుకుంటే 25 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర వాణిజ్య శాఖ అంచనా వేసింది.ఇందులో భాగంగా డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్(డీపైఐటీ) దేశవ్యాప్తంగా ఫర్నిచర్ తయారీకి సంబంధించి పార్కుల ఏర్పాటుకు మార్గదర్శకాలను జారీ చేయడంతోపాటు అనువైన ప్రాంతాలను పరిశీలిస్తోంది. ఫర్నిచర్ తయారీకి అవసరమైన దుంగలు, ఇతర కలపపై దిగుమతి సుంకం ఎత్తివేయడంతో పాటు మరిన్ని అనుబంధ యూనిట్లకు రాయితీలు ఇచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. పోర్టులకు దగ్గర్లో ఫర్నిచర్ తయారీ పార్కులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. చెన్నై, కృష్ణపట్నం రేవులకు చేరువలో ఉన్నందున నెల్లూరు జిల్లాలో భారీ యూనిట్ ప్రతిపాదనకు డీపీఐఐటీ నుంచి సూత్రప్రాయంగా ఆమోదం లభించిందని పరిశ్రమల శాఖ అధికారులు వెల్లడించారు. డీపీఐఐటీ అధికారులు ఇప్పటికే స్థలాన్ని కూడా పరిశీలించారు.రాష్ట్రంలో ఏర్పాటయ్యే ఫర్నిచర్ పార్కులో ప్రధాన భాగస్వామిగా ఉండేందుకు ప్రముఖ దేశీయ ఫర్నిచర్ తయారీ సంస్థ గోద్రేజ్ ఆసక్తి వ్యక్తం చేసింది. మరో రెండు సంస్థలు కూడా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయని, ప్రస్తుతం ఇవి చర్చల దశలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.ఏసీలు, చర్మ పాదరక్షల తయారీ, ఆటో విడిభాగాలు, ఫర్నిచర్, సముద్ర ఉత్పత్తులు, స్టీల్, అల్యూమినియం, ఆగ్రో క్లస్టర్, ఆహార పదార్థాలు, వ్యవసాయ కెమికల్స్, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్, వైద్య చికిత్స ఉత్పత్తులు, టెలివిజన్, కెమెరాలు, బొమ్మలు, ఇథనాల్, ఎలక్ట్రానిక్ వెహికిల్ కాంపోనెంట్, స్పోర్ట్స్, జిమ్ పరికరాలు.

## కర్నూలులో కోట్ల వర్సెస్ కేఈ

కర్నూలు, అక్టోబరు 30, (న్యూస్ పల్స్)కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తెలుగుదేశం పార్టీకి వరసగా 2014, 2019 ఎన్నికల్లో కర్నూలు జిల్లా షాకిచ్చింది. గత ఎన్నికలలో వైసీపీ ఇక్కడ క్లీన్ స్వీప్ చేసింది. దీంతో చంద్రబాబు నష్ట నివారణ చర్యలు చేపట్టినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే తెలుగుదేశం పార్టీ డోన్ ఇన్ ఛార్జిగా మన్నె సుబ్బారెడ్డిని నియమించి కేఈ కృష్ణమూర్తి కుటుంబానికి చంద్రబాబు షాక్ ఇచ్చారు.డోన్ నియోజకవర్గంలో కేఈ కృష్ణమూర్తికి బలమైన వర్గముంది. అలాగే కోట్ల వర్గానికికి కూడా ఇక్కడ వర్గముంది. గత ఎన్నికలలో కోట్ల, కేఈ వర్గాలు కలిసినా ఇక్కడ మాత్రం టీడీపీకి విజయం దక్కలేదు. వరసగా రెండుసార్లు ఇక్కడి నుంచి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గెలుస్తూ వస్తున్నారు. కేఈ కుటుంబం ఇక్కడ ఆరుసార్లు గెలిచింది. అలాగే కోట్ల విజయభాస్కర్ రెడ్డి నుంచి సుజాతమ్మ వరకూ ఇక్కడ ప్రాతినిధ్యం వహించారకు.వరసగా రెండు ఎన్నికల నుంచి కేఈ కృష్ణమూర్తి సోదరుడు కేఈ ప్రతాప్ పోటీ చేసి ఓటమి పాలవుతున్నారు. ఈసారి మార్చాలని ఇటీవలే కేఈ ప్రభాకర్ కు ఈ నియోజకవర్గం బాధ్యతలను అప్పగించారు. కేఈ ప్రభాకర్ మాత్రం ఆలూరు నియోజకవర్గంపై దృష్టిపెట్టారు. దీంతో కోట్ల సుజాతమ్మను డోన్ కు పంపించాలని చంద్రబాబు భావించారు. దీనిపై రెండు కుటుంబాలతో కూడా చర్చలు జరిపినట్లు తెలిసింది.అయితే ఇద్దరికీ కాదని చంద్రబాబు డోన్ నియోజకవర్గ ఇన్ చార్జిగా మన్నె సుబ్బారెడ్డిని నియమించడం చర్చనీయాంశమైంది. డోన్ లో కేఈ, కోట్ల వర్గాలు బలంగా ఉన్న ప్పటికీ మధ్యే మార్గంగా చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారా? అన్న చర్చ జరుగుతోంది. ఇద్దరూ కలిస్తే ఇక్కడ టీడీపీని గెలిపించవచ్చన్న కారణంగా డోన్ నుంచి కేఈ కుటుంబాన్ని తప్పించినట్లు తెలిసింది. మరి కేఈ కుటుంబం రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి.

## అనాథలు దివ్యాంగుల ను ప్రతి ఒక్కరు ఆదరించాలి

### ప్రముఖ న్యాయవాది రమాదేవి

నెల్లూరు అక్టోబరు 30, (న్యూస్ పల్స్) అనాథలు దివ్యాంగుల ను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ప్రముఖ న్యాయవాది రమాదేవి అన్నారు . రెడ్ క్రాస్ లోగల వికలాంగుల శిక్షణ సంస్థలో బిస్కెట్ లు ఇతర తినుబండారాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొందరు న్యాయవాదులు కలిసి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు . బాధిత చిన్నారులను ప్రేమతో ఆదరణతో చూడాలని, వారికి ఉన్నతమైన భవిష్యత్తు కల్పించేందుకు తల్లిదండ్రులు, సేవాసంస్థలు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు .అంగవైకల్యాని లెక్కపెట్టకుండా ఎందరో శాస్త్రవేత్తలు ఉన్నత అధికారులు అయ్యారని వారిని స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు భాను రామ్. సుప్రియ రెడ్ క్రాస్ సిబ్బంది సుమతి ఉమా స్వప్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విశాఖ, సికింద్రాబాద్ మధ్య రైళ్లు

హైదరాబాద్, అక్టోబరు 30, (న్యూస్ పల్స్) పండుగ సీజన్‌లో ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా రైల్వే శాఖ దేశ వ్యాప్తంగా పలు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ ప్రత్యేక రైళ్లకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రయాణీకులు లాగిన్ చేసి తెలుసుకోవచ్చు. తెలుగు రాష్ట్రాల మీదుగా నడిచే ప్రత్యేక రైళ్లకు సంబంధించిన వివరాలను దక్షిణ మధ్య రైల్వే తన ట్విట్టర్ ఖాతాలో వెల్లడించింది.

## ఆ ముగ్గురిపై కమలం వేటు

రాజమండ్రి, అక్టోబరు 30, (న్యూస్ పల్స్)తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కార్పోరేషన్ మేయర్ ఎన్నికలు రసవత్తరంగా సాగిన సంగతి తెలిసిందే. ఈ మేయర్ ఎన్నికలు బీజేపీలో చిచ్చురేపాయి. కాకినాడలో ఇద్దరు బీజేపీ మహిళా కార్పోరేటర్ల సస్పెన్షన్ వేటు వేసింది. నూతన మేయర్ ఎన్నికలో వైసీపీకి మద్దతు తెలిపిన 5వ వార్డు కార్పొరేటర్ సుజాత, 41వ వార్డు కార్పొరేటర్ సత్యవతి. విప్ ధిక్కరించడంతో ఇద్దరినీ సస్పెండ్ చేసింది బీజేపీ.తాము జారీచేసిన విప్ ధిక్కరించడంతో ఇద్దరిని సస్పెండ్ చేశారు బీజేపీ క్రమశిక్షణా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పాకా సత్యనారాయణ. క్రమశిక్షణకు మారు పేరైన బీజేపీలో పార్టీ ఆదేశాలు ధిక్కరిస్తే ఏస్థాయిలో ఉన్నవారినైన ఉపేక్షించేది లేదని పార్టీ స్పష్టం చేసిందని వారిపైనా చర్యలు తప్పవన్నారు కాకినాడ పార్లమెంట్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్.టీడీపీ కైవసం చేసుకున్న కాకినాడ కార్పోరేషన్లో అసమ్మతి పరిణామాల నేపథ్యంలో మేయర్ సుంకర పావని పదవీచ్యుతురాలయిన సంగతి తెలిసిందే. సుంకర పావనిని మేయర్ పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వంగెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. జీవోఎంఎస్ నెంబర్ 129 ద్వారా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్ 1955లోని సెక్షన్ 91/ఎ(6) ద్వారా ఉత్తర్వులిచ్చారు.ఆమెతోపాటు డిప్యూటీ మేయర్ కాలా సత్తిబాబును కూడా పదవి నుంచి తొలగించారు. అనంతరం కొత్త మేయర్, డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్పోరేషన్ కూడా వైసీపీ వశం అయింది. కాకినాడ మేయర్‌గా సుంకర శివప్రసన్న, డిప్యూటీ మేయర్‌గా మీసాల ఉదయకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మేయర్ ఎన్నికకు టీడీపీ కార్పొరేటర్లు గైర్హాజరయ్యారు. బీజేపీ కార్పోరేటర్లు ఇద్దరు విప్ ఉల్లంఘించారు. దీంతో కఠినచర్యలకు ఉపక్రమించింది బీజేపీ.

## ఉత్తరాంధ్రకు పెద్ద పీట

విశాఖపట్టణం, అక్టోబరు 30 (న్యూస్ పల్స్)చంద్రబాబు రాజకీయమే ప్రత్యేకం. ఆయనది ఒక పొలిటికల్ స్కూల్. అందులో నేతలు ఎంతటి పెద్దవారు అయినా కూడా స్టూడెంట్స్ మాత్రమే . హెడ్ మాస్టర్ బాబు చెప్పిన పాఠాలే చదవాలి. బాబు లాగానే ఆలోచించాలి. బాబునే అనుసరించాలి. ఇదే కదా నాలుగు దశాబ్దాలుగా టీడీపీని గుప్పిట పట్టి చంద్రబాబు మార్క్ పాలిటిక్స్ ని నడిపిస్తున్న తీరు. ఇపుడు చంద్రబాబు విపక్షంలోకి వచ్చారు. అయినా ఆయన ఆదేశాలు ఎక్కడా ఆగడంలేదు. ఆయన చెప్పిందే వేదంగా టీడీపీ సాగాలంటున్నారు.ఈసారి జాగ్రత్తగా గమనిస్తే ఉత్తరాంధ్రాకు చంద్రబాబు పెద్ద పీట వేశారు. గతంలో ముగ్గురు ఉన్న పొలిట్ బ్యూరో మెంబర్స్ ఆరుగురు అయ్యారు. జాతీయ ఉపాధ్యక్ష పదవి తో పాటు, జాతీయ ప్రధాన కార్యదర్శి పదవులు ఈ జిల్లాలకే ఇచ్చారు. అంతే కాదు, ఏపీ టీడీపీ ప్రెసిడెంట్ కూడా ఇచ్చారు. ఇవి కాకుండా సెంట్రల్ కమిటీలో కూడా సీనియర్లను తీసుకున్నారు. ఆరుగురిని పార్లమెంట్ ప్రెసిడెంట్లను చేశారు. ఇంకా రాష్ట్ర, జిల్లా కమిటీలు ప్రకటిస్తే మరిన్ని పదవులు దక్కుతాయి. సరే ఇవన్నీ ఇచ్చిన చంద్రబాబు కచ్చితంగా హై కమాండ్ ఆదేశాలు పాటించాలని హుకుం జారీ చేస్తున్నారు.టీడీపీకి ఇపుడు అమరావతి మాత్రమే ఏకైక రాజధానిగా కావాలి. ఈ విషయంలో చంద్రబాబు ఎంతదాకానైనా పోరాటం చేస్తారు. విశాఖకు రాజధాని వద్దు అనిపించాలి. ఆ మాట తమ్ముళ్ళ నోటి వెంట పదే పదే రావాలి. వారే జనాలకు కూడా మౌల్డ్ చేయాలి. ఇదీ బాబు పెట్టిన అతి పెద్ద బాధ్యత. విశాఖను ఎవరూ రాజధానిగా కోరుకోవడంలేదు అంటూ అపుడే చంద్రబాబు మాటను తన నోట పలికించారు కొత్త ప్రెసిడెంట్ అచ్చెన్నాయుడు. ఉత్తరాంధ్రాకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు రాజీనామా చేసి ఆ సంగతి తేల్చుకోవచ్చునని కూడా ఆయన సవాల్ చేస్తున్నారు.ఇలా తమ్ముళ్ళు విశాఖను కాదంటూ లోకల్ పాలిటిక్స్ చేయాలంటే కష్టమే మరి. సరిగ్గా ఇలాంటి వత్తిడే వస్తే తట్టుకోలేకనే తాను పార్టీని వీడానని టీడీపీ సౌత్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ చెప్పారు కూడా. ప్రతీ రోజూ హై కమాండ్ నుంచి అమరావతికి అనుకూలంగా మేసేజ్ వస్తుంది. దాన్ని పట్టుకుని విశాఖలో గర్జించాలి. మరి ఆ పని తమ్ముళ్ల అయ్యే పనేనా. చాలా మంది మాత్రం నో అని బయటకు చెప్పలేక అలాగని ఎస్ అనలేక అపుడే ఇబ్బంది పడుతున్నారుట. మరి చంద్రబాబు ఇదే విధానంతో తమ్ముళ్ల మీద వత్తిడి తెస్తే మాత్రం పార్టీకి పదవులకు రాం రాం అనే బాపతు కూడా బాగానే ఉంటారని అంటున్నారు. చూడాలి మరి.

## బీజేపీలో పొత్తుల లొల్లి

విజయవాడ, అక్టోబరు 30, (న్యూస్ పల్స్)భారతీయ జనతా పార్టీలో పొత్తుల వ్యవహారం ముదిరిపాకాన పడే అవకాశాలు కన్పిస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఎవరితో పొత్తు పెట్టుకోవాలన్న దానిపై ఇప్పటికే చర్చలు ప్రారంభమయ్యాయి. బీజేపీలో టీడీపీ అనుకూల, వ్యతిరేక వర్గాలు పొత్తుల విషయంలో పోరుకు సిద్ధమవుతున్నట్లు కన్పిస్తుంది. తాజాగా రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ చేసిన వ్యాఖ్యలు దీనికి అద్దంపడుతున్నాయి. టీడీపీతో పొత్తుకు ఒకవర్గం తీవ్రంగానే ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.బీజేపీలో కొన్ని దశాబ్దాల నుంచి చంద్రబాబు అనుకూల, వ్యతిరేక వర్గాలున్నాయి. కంభంపాటి హరిబాబు పార్టీ అధ్యక్షుడిగా ఉన్న నాటి నుంచి చంద్రబాబుకు అనుకూలంగా ఆ పార్టీ వ్యవహరిస్తుంది. అయితే ఆర్ఎస్ఎస్ భావాలున్న పార్టీ నేతలు కొందరు చంద్రబాబుతో పొత్తును వ్యతిరేకిస్తున్నారు. చంద్రబాబు కారణంగానే పార్టీ ఏపీలో బలోపేతం కాలేదని వారు వాదిస్తున్నారు. తమతో పొత్తు ఉంటేనే చంద్రబాబుకు అధికారం సిద్ధిస్తుందని కూడా వారు లెక్కలతో వివరిస్తున్నారు. అయితే తాజాగా సీఎం రమేష్ పార్టీ ఇన్ ఛార్జిపైనే వ్యాఖ్యలు చేయడం వివాదంగా మారింది. పార్టీ ఇన్ ఛార్జి సునీల్ దేవధర్, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావులు పొత్తులను నిర్ణయించలేరని, పార్టీ జాతీయ అధ్యక్షుడు నిర్ణయించాల్సి ఉంటుందని ఆయన చేసిన కామెంట్స్ బీజేపీలో పొత్తుల పోరును సూచిస్తున్నాయి. మరోవైపు సునీల్ దేవధర్ కూడా ఘాటుగానే వ్యాఖ్యానించారు. టీడీపీతో పొత్తు ఉండే ప్రసక్తి లేదని ఆయన తేల్చి చెప్పారు.టీడీపీ నుంచి బీజేపీలో చేరిన సుజనా చౌదరి, సీఎం రమేష్, టీజీ వెంకటేష్ లు పొత్తు ఉండాలని కోరుకుంటున్నారు. పొత్తు ఉంటేనే బీజేపీకి కొన్ని సీట్లు వస్తాయని, లేకుంటే 2019 ఎన్నికల ఫలితలు పునరావృతమవుతాయని చెబుతున్నారు. ఈ మేరకు వారు వత్తిడి తెచ్చేందుకే సిద్ధమవుతున్నారు.

# విద్యుత్ రంగంపై కరోనా ప్రభావం

విజయవాడ, అక్టోబరు 30 (న్యూస్ పల్స్) వార్షిక, ఆదాయ అవసర నివేదికలు సమర్పించేందుకు విద్యుత్ సంస్థలు కసరత్తు ముమ్మరం చేశాయి. ఏపీ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్‌ను విద్యుత్ పంపిణీ సంస్థగా మార్చేసింది? ఏపీ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ పేరును ఏపీ రూరల్ అగ్రికల్చర్ పవర్ సప్లై కంపెనీ (ఏపీ రాస్కామ్ )గా మారుస్తూ నిర్ణయం తీసుకుంది వైఎస్ జగన్ సర్కార్.. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పంపిణీ కోసం విద్యుత్ పంపిణీ సంస్థగా ఏపీ రాస్కామ్ పనిచేయనుంది? ప్రస్తుతానికి రాష్ట్రంలోని మూడు డిస్కంలకు చెందిన విద్యుత్ పంపిణీ వ్యవస్థను వినియోగించుకుని సేవలు అందించనుంది ఏపీ రాస్కామ్. మూడు డిస్కంల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పంపిణీ లైన్లను వినియోగించుకునేందుకు వీలింగ్ ఛార్జీలను రాస్కామ్ చెల్లించనుంది. పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేంత వరకూ డిస్కంలకూ వీలింగ్ ఛార్జీల చెల్లింపునకు నిర్ణయం తీసుకున్నారు. ఇక, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో ప్రస్తుత డిస్కంలు కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఏపీ రాస్కామ్ కు బదిలీ చేయాలని నిర్ణయించింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. ఏపీలోని మూడు డిస్కంలకు ఏపీ రాస్కామ్ చెల్లించే వీలింగ్ ఛార్జీలు, విద్యుత్ ట్రాన్స్ మిషన్ ఛార్జీలు, ఫీడర్ సెగ్రిగేషన్ ఛార్జీలు, ఇతర వ్యయాన్ని ఎలక్ట్రిసిటీ డ్యూటీగా వినియోగదారుల నుంచి వసూలు చేయాలని నిర్ణయం తీసుకుంది. కాగా, విద్యుత్ రంగంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా ఏపీ సర్కార్ అడుగులు వేస్తున్న సంగతి తెలిసిందే. ఏపీఈఆర్సీ నవంబర్ చివరి నాటికి ఏఆర్ఆర్‌లు సమర్పించాలని డిస్కమ్‌లను ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని మూడు డిస్కమ్‌లు ఇప్పటి వరకు ఉన్న ఆదాయ వివరాలు, వచ్చే ఏడాదికి కావాల్సిన రెవెన్యూను అంచనా వేస్తున్నాయి. ఏపీఈఆర్సీ ఇచ్చిన గడువులోగానే ఏఆర్ఆర్‌లు సమర్పిస్తామని డిస్కమ్‌ల సీఎండీలు తెలిపారు. దీనిపై కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ జరిపి, వచ్చే ఏడాదికి అనువైన టారిఫ్‌ను ప్రకటిస్తుంది. ఈ టారిఫ్ వచ్చే ఏప్రిల్ నుంచి అమలులోకి రావాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం మొదలైనప్పటి నుంచి రాష్ట్ర విద్యుత్ సంస్థల ఆదాయానికి కోవిడ్–19 భారీగా గండికొట్టింది. ఆరు నెలలు గడిచినా పెద్దగా మార్పు కనిపించడం లేదు. సాధారణంగా ఈ ఏడాది సెప్టెంబర్ చివరి నాటికి ఉన్న గణాంకాలనే ఏఆర్ఆర్‌లోకి తీసుకుంటారు. దీని ఆధారంగా అంచనాలు రూపొందిస్తారు. నిజానికి ఈ ఆరు నెలల కాలంలో డిస్కమ్‌ల ఆదాయం భారీగా తగ్గింది. గత ఏడాది (2019) రూ.11,038.35 కోట్లు ఉంది. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.9,509.62 కోట్ల ఆదాయం వచ్చింది. అంటే ఈ ఆర్థ సంవత్సరంలో రూ.1,528.73 కోట్ల రెవెన్యూ వసూళ్లు పడిపోయాయి. లాక్‌డౌన్ కారణంగా ఏప్రిల్–జూన్ నెలల్లో గృహ విద్యుత్ వినియోగం పెరిగింది. 2019 ఆరు నెలల్లో గృహ విద్యుత్ రాబడి రూ.2,726.65 కోట్లు ఉంటే, ఈ సంవత్సరం ఆరు నెలల్లో రూ.2,831 కోట్లు ఉంది. రూ. 104.35 కోట్లు పెరిగినా, డిస్కమ్‌లకు పెద్దగా ప్రయోజనం లేదు. ఎందుకంటే గృహ విద్యుత్‌ను చాలా వరకు సబ్సిడీపైనే ఇస్తారు. మన రాష్ట్రంలో తక్కువ టారిఫ్ ఉంది. డిస్కమ్‌ల నష్టాలను పూడ్చడంలో కీలక పాత్ర పోషించే వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ రాబడి ఈసారి గణనీయంగా తగ్గింది. పారిశ్రామిక విద్యుత్ రెవెన్యూ 2019లో రూ.4,771.03 కోట్లు ఉంటే.. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.3,754.19 కోట్లు మాత్రమే ఉంది. అంటే 1,016.84 కోట్లు తగ్గింది. వాణిజ్య విద్యుత్ రెవెన్యూ గత ఏడాది రూ.2,272.56 కోట్లు ఉంటే, ఈ సంవత్సరం ఆరు నెలల్లో రూ.1,603.47 కోట్లు ఉంది. రూ.669.09 కోట్లు తగ్గింది. విద్యుత్‌ను వినియోగదారుడికి చేరవేయడానికి ప్రతి యూనిట్‌కు దాదాపు రూ.5.05 వరకు ఖర్చవుతుంది. గృహ వినియోగం వల్ల యూనిట్‌కు సగటున రూ.4.05 వరకు వస్తుంది. మిగతా మొత్తాన్ని పారిశ్రామిక, వాణిజ్య విద్యుత్ (క్రాస్ సబ్సిడీ) ద్వారా పూడ్చుకుంటారు. ఈసారి ప్రధాన ఆదాయ వనరులే దెబ్బతిన్నాయి. దీనికి తోడు గత ప్రభుత్వ బకాయిలను అప్పు చేసి మరీ ఈ ప్రభుత్వం చెల్లించాల్సి వచ్చింది. ఫలితంగా వడ్డీ భారం విద్యుత్ సంస్థలను వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో డిస్కమ్‌లు సమర్పించే ఏఆర్ఆర్‌లు కీలకం కాబోతున్నాయి.

## బద్వేలు ఉప ఎన్నికల్లో టీడీపీ నాయకులు ఎంట్రీ...బీజేపీతో కలిసి ఇలా.

కడప అక్టోబరు 30 (న్యూస్ పల్స్) బద్వేలు ఉప ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోంది. ఉదయం 9 గంటలకు వరకు 10.49 శాతం పోలింగ్ జరిగింది. అధికారు పోలింగ్ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. బద్వేలు బాలయోగి ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్లో వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని బద్వేలు ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేతన్ గార్గ్ పరిశీలిస్తున్నారు. అలాగే పోలింగ్ అధికారులకు తగు మార్గదర్శకాలు జారీ చేస్తున్నారు. అయితే పలు చోట్ల బీజేపీ పోలింగ్ ఏజెంట్లుగా టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉప ఎన్నికల్లో టీడీపీ పోటీకి దూరంగా ఉండడంతో.. ఆ పార్టీ నేతలు ఇప్పటికే కిందిస్థాయిలో బీజేపీకి మద్దతిస్తున్నట్లు గుసగుసలు వినిపించాయి. తాజాగా బీజేపీకి మద్దతుగా టీడీపీ నాయకులు పోలింగ్ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్సీపీ నేతలు విమర్శిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి పనతల సురేష్ తో బి.కోడూరు మండలంలో టీడీపీ నాయకులు కలిసి ఉన్నట్లు ఫొటోలు వైరల్ అయ్యాయి. 223 బూత్ కాలవపల్లె పోలింగ్ ఏజెంట్గా టీడీపీ కార్యకర్త సుధాకర్ రెడ్డి, గోపవరం బూత్–258లో బీజేపీ తరుపున ఇద్దరు ఏజెంట్లుగా టీడీపీ కార్యకర్తలు నారాయణ, నరసింహులు కూర్చున్నట్లు తెలిసింది. మరోవైపు గోపవరం ఎస్ఐపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు కడప జిల్లా ఎస్పీ అన్బు రాజన్ కు ఫిర్యాదు చేశారు. బీజేపీ ఏజెంట్లను ఎస్ఐ ఇబ్బంది పెడుతున్నారని ఆయన ఆరోపించారు. బెదిరింపులకు పాల్పడుతున్న ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరువెంగళాపురం పోలింగ్ కేంద్రం వద్ద కేంద్ర బలగాలు లేవని సోము వీర్రాజు అభ్యంతరం వ్యక్తం చేశారు. అదేవిధంగా పోరుమామిళ్లలో బయటి వ్యక్తులు వచ్చారని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

## అట్లూరులో దొంగ ఓట్ల ఆరోపణలు

కడప అక్టోబరు 30 (న్యూస్ పల్స్) కడప జిల్లా బద్వేలు ఉప ఎన్నికల కరోనా నిబంధనల నడుమ ఈరోజు ఉదయం 7 గంటలకు ప్రారంభమైంది. అయితే అట్లూరు మండలంలో దొంగ ఓట్లు వేస్తున్నారంటూ వార్తలు వినిపిస్తున్నాయి. కొంతమంది మహిళలు బద్వేలు ఉప ఎన్నికల్లో అట్లూరు మండలంలో ఫేక్ ఐడి లతో ఓట్లు వేయడానికి కొంతమంది మహిళలు వచ్చినట్లు తెలుస్తోంది. పోలీసుల తనిఖీలలో సరైన ఐడి కార్డులు లేవని గుర్తించి.. ఆ మహిళలను పోలింగ్ కేంద్రం నుంచి వెనక్కి పంపించారు. మండలంలో ఎస్ వెంకటాపురం లో బయట నుంచి ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తులను గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తనికీలు చేసి కొంత మంది మహిళలకు సరైన గుర్తింపు కార్డులు లేకపోవని గుర్తించి వారిని వెనక్కి పంపించారు. ఈ సమయంలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు చెప్పులతో దాడికి ప్రయత్నం చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఇరు వర్గాలను చెదర గొట్టారు. ఇక ఉపఎన్నికల పోలింగ్ లో ఓటర్లు భారీగా పాల్గొంటున్నారు. తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి మహిళా ఓటర్లు బారులు తీరారు. మరోవైపు గోపవరం మండలం బేతాయపల్లి లోని 261 పోలింగ్ కేంద్రంలో గర్భవతి ఓటు వేసేందుకు వచ్చింది. క్యూ లో నిల్చుని చంద్రకళ అనే గర్భవతి సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే స్పందించిన ఎన్నికల సిబ్బంది ప్రాథమిక చికిత్స నందించారు.

## విద్యుత్ చార్జీలు తగ్గించాలి

రాజమండ్రి అక్టోబరు 30 (న్యూస్ పల్స్)రాష్ట్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను ఇబ్బందులకు గురి చేయడమే ధ్యేయంగా పెట్టుకుందని తెలుగుదేశం పార్టీ నాయకులు మండిపడ్డారు. నిత్యం విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ అన్ని వర్గాల ప్రజలను దోచుకుంటోందని దుయ్యబట్టారు. వైసీపీ ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా నగర తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం దేవీచౌక్ నుంచి కంబాలచెరువు గాంధీ విగ్రహం వరకూ నిరసన ర్యాలీ జరిగింది. పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసన... ఇక మనకు విసన కర్రలే గతి అని తెలియ చేస్తూ రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ శ్రీనివాస్ టీడీపీ నాయకులు ప్రజలకు కర పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి టిడిపి పాలనలో కరెంటు చార్జీలు విపరీతంగా పెంచేశారని, తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు ప్రజల పై అధికంగా విద్యుత్ ఛార్జీలను మోపటం సరైన విధానం కాదని చెప్పారు.

# బద్వేలు అసెంబ్లీ ఉపఎన్నికలో టీడీపీ-బీజేపీ నేతలు ఏకమయ్యారా?

కడప అక్టోబర్ 30 కడప జిల్లాలోని బద్వేలు అసెంబ్లీ ఉపఎన్నికలో టీడీపీ–బీజేపీ నేతలు ఏకమయ్యారనే వార్తలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే. బీజేపీకి టీడీపీ మద్దతు పలకటమంటే కాస్త విచిత్రంగానే ఉంది. ఇంతకీ విషయం ఏమిటంటే బద్వేలు నియోజకవర్గంలో పోటీ చేస్తున్న బీజేపీకి ఏమాత్రం బలంలేదు. పార్టీ ఎంత బలహీనంగా ఉందంటే కనీసం 281 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఏజెంట్లను కూడా పెట్టుకోలేని దయనీయస్థితిలో ఉంది. ఉపఎన్నికలో కనీసం పోలింగ్ ఏజెంట్లను కూడా కూర్చోబెట్టలేకపోతే పరువు పోతుందని దాదాపు రెండువారాలుగా టీడీపీ నేతలకు కమలనాదులు గాలమేస్తున్నారు. టీడీపీ ఎలాగూ పోటీలో లేదుకాబట్టి తమ పార్టీ తరపున పోలింగ్ ఏజెంట్లుగా కూర్చోమని తమ్ముళ్ళని బతిమలాడుకుంటున్నారు. బీజేపీ అభ్యర్థి సురేష్+కీలక నేత ఆదినారాయణరెడ్డి అండ్ కో కాశీనాయనపల్లి మండలంలోని టీడీపీ నేత వెంకటరెడ్డి ఇంటికి వెళ్ళి మరీ చర్చలు జరిపారు. దాదాపు రెండు వారాల క్రితం వరకు కేవలం పోలింగ్ ఏజెంట్లుగా కూర్చుంటే చాలని చర్చలు జరిపిన కమలనాదులు వారం క్రితం నుండి టీడీపీ ఓట్లను బీజేపీ అభ్యర్థికి వేయించాలని బేరాలు పెట్టినట్లు సమాచారం. టీడీపీ ఓట్లు వృధాగా పోకుండా తమ పార్టీకి వేయిస్తే దానికితగ్గ ప్రతిఫలం ఉంటుందని ప్రలోభాలకు తెరలేపినట్లు తెలుస్తోంది. టీడీపీ మాజీ ఎంఎల్ఏ విజయమ్మ కొడుకు రితేష్ రెడ్డితో కొందరు కమలనాదులు ఈ మేరకు చర్చలు జరిపినట్లు సమాచారం. అయితే బీజేపీ నేతల ప్రలోభాలకు గాలానికి తమ్ముళ్ళు తగులుకున్నారా లేదా అన్నది మొదట్లో తేలలేదు. కానీ ఈరోజు పోలింగ్ సందర్భంగా గమనిస్తే కొన్ని పోలింగ్ కేంద్రాల్లో బీజేపీ ఏజెంట్లుగా టీడీపీ శ్రేణులు కనిపించాయనే ప్రచారం పెరిగిపోతోంది.

అంటే పోలింగ్ ఏజెంట్లుగా కూర్చోవటానికి సిద్ధపడిన టీడీపీ నేతలు మరి తమ ఓట్లను కూడా వేయించటానికి సిద్ధపడ్డారా అనే అనుమానాలు పెరిగిపోతున్నాయి. నిజానికి బీజేపీకి మొన్నటి ఎన్నికల్లో వచ్చిన ఓట్లు 735 మాత్రమే. కమలంపార్టీకి ఏ ఎన్నికలో కూడా పోటీచేసేంత బలంలేదు. అలాంటిది ఇపుడు పోటీలోకి దిగిందంటేనే కారణం అర్థమైపోతోంది. పోటీలో లేని ఇతర పార్టీల నేతల సేవలను ఓట్లను వేయించుకునే ప్లాన్ చేసినట్లు మొదట్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే పోలింగ్ రోజున జరిగిన పరిణామాలను బట్టి చూస్తే బీజేపీ నేతలు మాత్రం ఈ విషయంలో సక్సెస్ సాధించినట్లే కనబడుతోంది. వ్రతం చెడ్డా ఫలితం ఎలాగుంటుందో చూడాలి.

# వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష రీసర్వే తో వ్యవసాయ భూములు సమగ్ర సర్వే



కొవ్వూరు అక్టోబరు 30 (న్యూస్ పల్స్) వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం మన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఒక బృహత్తరమైన కార్యక్రమమని కొవ్వూరు ఆర్డీవో ఎస్. మల్లిబాబు అన్నారు. వ్యవసాయ భూములు రీసర్వే పథకం అమల్లో భాగంగా శనివారం ఆర్డీవో కార్యాలయంలో 13 మండలాలకు చెందిన ఎంపిక చేసిన అధికారులకు, సిబ్బందికి ఆర్డీవో సమక్షంలో మాస్టర్ ట్రైనర్ సురేష్ "ఎస్ ఓ పి" పై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఎస్. మల్లిబాబు మాట్లాడుతూ, ఆధునాతన టెక్నాలజీ వినియోగించిన డ్రోన్ ద్వారా చేస్తున్న వ్యవసాయ భూములు రీసర్వే పనులను దేశంలో ఎక్కడా ఇప్పటివరకు చేపట్టి ఉండలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే జరుగుతుందని, ఇందులో భాగంగా ప్రతి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఒక గ్రామంలో సర్వే నిర్వహించామన్నారు. రాబోయే తరాలు ఇబ్బంది లేకుండా వారి ఆస్తులకు రీ సర్వే ద్వారా భద్రత ఏర్పడుతుందన్నారు. రైతుల భూముల సరిహద్దులు విషయంలో ఎలాంటి వివాదాలకు తావు ఇవ్వకుండా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో తోగుమ్మి గ్రామంలో రీసర్వే పూర్తి చేశామని పేర్కొన్నారు. 70 / 80 ఏళ్ల క్రితం సర్వే చేపట్టడం జరిగిందన్నారు. ల్యాండ్ పార్సెల్ నెంబర్ ఇవ్వడం ద్వారా భూ యజమానులకు చెందిన యాజమాన్యం, పరిమాణం, స్థానం, ప్రాంతం మరియు ఇతర ముఖ్యమైన మరియు సంబంధిత వివరాలను అందులో గుర్తించగల మన్నారు. ఈ సర్వే పూర్తి వివరాలు ద్వారా తమ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో ఆన్ లైన్ ద్వారా తెలుసుకొనేందుకు ఈ పథకం రక్షగా , దిక్సుచి గా ఉంటుందన్నారు. ఒక్కసారి క్లిక్ చేస్తే తమ భూముల ఎక్కడ ఉన్నాయనే విధంగా ఆన్లైన్ రికార్డును తయారు చేస్తున్నామని ఆర్డీవో పేర్కొన్నారు. ఎలాంటి ఢోకా లేని విధంగా ఆస్తుల వివరాలు భద్రంగా ఉండే విధంగా రికార్డులను

**రోవర్ మిషన్, క్యూజిఎస్ సాఫ్ట్ వేర్, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం.**

**భూమిరికార్డుల ఆధునీకీకరణతో రాబోయే కాలంలో భూములకు రక్షణ..**

**ఆర్డీవో ఎస్.మల్లిబాబు**

ఆధునీకరణ సాధ్యం అవుతుందన్నారు. అంతేగాక పాత పద్ధతిలోగ్రామ కంఠం, హద్దులు, సర్వే రాళ్లు కూడా ఆయా భూముల్లో రీసర్వేలో భాగంగా పాతుతారన్నారు. బండి దారి, గట్లు, పొలాలు హద్దులు వివాదాలు వంటివి గతంలో ఎన్నో తలెత్తేవని, అలాంటి వివాదాలకు నేడు తావు లేకుండా, కోర్ట్ తగాదాలు పరిష్కారం చూపేలా ఎవరి హద్దులు ఎక్కడ ఉన్నాయనే విధంగా సర్వే రాళ్లను పాతటంతో పాటు సాంకేతికంగా రికార్డులను తయారు చేస్తున్నారని తెలిపారు. ఈ బృహత్తర పథకంలో రెవిన్యూతో పాటు పంచాయితీ వంటి అనేక శాఖల అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారని అన్నారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలు సమన్వయంతో పని చెయ్యడం ద్వారా మరింత సచ్చిలత తో పారదర్శకంగా రికార్డుల నిర్వహణ సాధ్యం అవుతుందని అన్నారు. రీసర్వే అంటే ఏమిటి? ఎందుకు చేస్తున్నాము అనే దానిపై స్పష్టత ఉండాలని రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనర్ సురేష్ పేర్కొన్నారు. ఎస్ ఓ పి (స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోగ్రాం) పై పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించారు. భవిష్యత్తులో జరిగే భూ లావాదేవీలకు రికార్డుల్లో పేర్లు మార్పు చేయాలన్నా ఖచ్చితంగా పని అయ్యే విధంగా సాంకేతికంగా అభివృద్ధి రీసర్వే చేసి రికార్డు చేసే విధంలో సర్వే చేపట్టాల్సి ఉందన్నారు. ఖచ్చితత్వం తో వేగంగా పూర్తి చేయాలనే డ్రోన్ ద్వారా రీసర్వే చేసేందుకు సిబ్బందికి శిక్షణ అందిస్తున్న ట్లు పేర్కొన్నారు. రెవెన్యూ భూ చట్టాలపై అవగాహన, నాలెడ్జి, చురుగ్గా వ్యవహరించే శైలి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం లో ప్రాథమిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు శిక్షణా కార్యక్రమంలో ప్రతి మండలం నుంచి మండల సర్వేయర్లు, డిప్యూటీ తహసిల్దార్ లు, ఆయా మండలంలోని బెస్ట్ విఆర్వో లు, గ్రామ సర్వేయర్లు, రెవిన్యూ ఇన్ స్పెక్టర్ లు ఒక్కొక్కరు చొప్పున ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇక్కడ పొందిన శిక్షణ తరగతుల వివరాలు మీ మీ మండల స్థాయిలో ఆచరణలో పెట్టాల్సిన భాధ్యత తీసుకుని, పారదర్శకంగా రీసర్వే పూర్తి చేయాలని సూచించారు. శిక్షణా కార్యక్రమంలో మండల సర్వేయర్లు, డిప్యూటీ తహసిల్దార్ లు, ఆయా మండలంలోని బెస్ట్ విఆర్వో లు, గ్రామ సర్వేయర్లు, రెవిన్యూ ఇన్ స్పెక్టర్ లు ఒక్కొక్కరు చొప్పున హాజరయ్యారు.

## అంబేద్కర్ అడుగుజాడల్లో జాతీయవాద స్థాపనకు నడుస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏబివిపి

గోనెగండ్ల అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఎమ్మిగనూరు శాఖ ఆధ్వర్యంలో గోనెగండ్ల మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం మరియు కళాశాల కమిటీ వేయడం జరిగిందని ఈ సందర్భం ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మారుతి మాట్లాడుతూ దేశంలో జాతీయవాదం తయారుచేసే కర్మాగారంగా ఏబీవీపీ పనిచేస్తుందని అనునిత్యం దేశంలోని అసమానతలు తొలగించి దేశ పౌరులు అందరూ ఒక్కటిగా దేశాన్ని ఉన్నత స్థితిలో చూడాలన్న అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏబీవీపీ అన్నారు. విద్యార్థి సమాజం దేశభక్తుల అయితే దేశం ఉన్నత స్థానంలో ఉంటుంది అనే ఆకాంక్షతో ఏబీవీపీ ముందుకు సాగుతుందని వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ పునర్నిర్మాణం జరుగుతుందని ఒక సిద్ధాంతాలతో పనిచేస్తుంది. స్వాతంత్రం సిద్ధించిన తర్వాత దేశం కోసం జీవిద్దాం దేశం కోసం మరణిస్తాము అంటూ దేశంలో జాతీయవాదం దేశభక్తిని పెంపొందించడం కోసం అనేక విద్యార్థి ఉద్యమాలు

**ఏబీవీపీ కర్నూల్ జిల్లా కన్వీనర్ మారుతి**

నిర్వహిస్తూ ఏబీవీపీ నేటి ప్రపంచంలో ఒక గొప్ప విద్యార్థి సంఘం గా కొనసాగుతుంది నమ్మిన సిద్ధాంతం కోసం జాతీయవాదం పెంపొందించడం కోసం ఎంతో మంది కార్యకర్తలు ప్రాణాలు త్యాగం చేసిన ఘనత ఏబీవీపీది దేశంలో అనేక విద్యార్థి సామాజిక ఉద్యమాలకు ఏబీవీపీ నాయకత్వం వహించి అనేక మంది సామాజిక కార్యకర్తలను రాజకీయ నాయకులను శాస్త్రవేత్తలను దేశానికి అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని అలాగే దేశమే దేహం దేహమే దేశంగా దేశం కోసం ప్రాణాలు ఇచ్చే ఎంతోమంది కార్యకర్తలకు ఏవి పునాది విద్యార్థిని విద్యార్థులు అందరూ విద్యార్థి సమస్యకు పరిష్కారంగా వహిస్తున్న ఏబివిపి లో సభ్యులుగా చేరాలని అన్నారు. అనంతరం గోనెగండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యక్షుడు గోపి సహాయ కార్యదర్శి సురేష్ ను ఎన్నుకున్నారు

# బద్వేల్ ఉప ఎన్నికల్లో ప్రారంభమైన ఎన్నికల పోలింగ్

కడప అక్టోబరు 30 (న్యూస్ పల్స్) కడప జిల్లా బద్వేలు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ప్రారంభమైంది. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరగనుంది. మొత్తం పోలింగ్ ప్రక్రియను వీడియో రికార్డింగ్తోపాటు వెబ్కాస్టింగ్ కూడా చేస్తునట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కె. విజయానంద్ వెల్లడించారు. 2019లో 77.64 శాతం పోలింగ్ 2019 సార్వత్రిక ఎన్నికల్లో బద్వేలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 77.64 శాతం పోలింగ్ నమోదైంది. అప్పట్లో 2,04,618 ఓట్లు ఉండగా 1,58,863 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 77,466 మంది, 81,394 మంది మహిళలు, ముగ్గురు ట్రాన్స్జెండర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. దీంతో 77.64 శాతం నమోదైంది. ప్రస్తుతం బద్వేలు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 2,15,292 ఓట్లు ఉన్నాయి. అందులో పురుషులు 1,07,915 మంది, మహిళలు 1,07,355 మంది ఉన్నారు. ట్రాన్స్జెండర్లు 22 మంది ఉన్నారు. బద్వేలు ఉప ఎన్నిక నేపథ్యంలో కోవిడ్ను దృష్టిలో పెట్టు కుని అధికారులు ప్రత్యేక చర్య లు చేపట్టారు. ప్రధానంగా రెండు డోసుల టీకా పూర్తయిన వారిని మాత్రమే పోలింగ్ సిబ్బందిగా విధులు నిర్వర్తించేందుకు చర్యలు చేపట్టారు. అంతేకాకుండా ఏజెంట్లు, సిబ్బంది కూడా కోవిడ్ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి బద్వేలు ఉప ఎన్నికకు సంబంధించి ఎన్నికల అధికారులతోపాటు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అధ్యర్యంలో మూడు వేల మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందో బస్తు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా 221 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. అంతేకాకుండా లైవ్ వెబ్కాస్టింగ్, వీడియో కెమెరాల ద్వారా చిత్రీకరణ చేసారు. ఇద్దరు అదనపు ఎస్పీలతోపాటు 15 మంది డీఎస్పీలు, 50 మంది సీఐలు, 160 మంది ఎస్ఐలు, 320 మంది హెడ్కానిస్టేబుల్, ఏఎస్ఐలు, 980 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 300 మంది హోం గార్డులు, 15 ప్లాటూన్ల కేంద్ర బలగాలు (960 మంది), 72 రూట్ మొబైల్స్, 36 స్ట్రయికింగ్ ఫోర్స్, 11 స్పెషల్ స్ట్రయికింగ్ ఫోర్స్తో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు.

## బెజవాడ టీడీపీ లో మరోసారి భగ్గుమన్న విభేదాలు

విజయవాడ అక్టోబరు 30 (న్యూస్ పల్స్) విజయవాడ తేదేపాలో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. పార్టీలో సీనియర్ నేతలకు ఎంపీ కేశినేని నాని వలన అన్యాయం జరుగుతుందని నేతలు ఆగ్రహం వ్యక్తం చేసారు. పార్టీ నేత ఎఱుబోతు రమణారావు మాట్లాడుతూ తనకు పార్టీ లో అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేసారు. టీడీపీ పార్టీ పెట్టినప్పుడు నుంచి ఎంతో కష్టపడి పని చేసాను. నగర ప్రధాన కార్యదర్శి గా ఇస్తానని నమ్మించి మోసం చేశారు. బీసీ నేత అయిన తనకు తీరని అన్యాయం చేస్తున్నారు. టీడీపీ నుంచి ఫ్లోర్ లీడర్ గా పని చేసిన అనుభవం కూడా తనకు ఉంది. పార్టీ కోసం ఎంతో కష్టపడి పని చేసాను. తిరువూరు కి చెందిన నాయకుడు కి ప్రధాన కార్యదర్శి పదవి ఇస్తే ఇక్కడ కార్యకర్తలు కి అవసరం వస్తే అక్కడకు వెళ్లగలరా అని ప్రశ్నించారు. టీడీపీ కి వెన్నుముక బీసీ లే అన్న విషయం గుర్తుంచుకోవాలి. పార్టీలు మారి వచ్చిన వారికి టీడీపీ లో రాష్ట్ర స్థాయి పదవులు ఇచ్చి సీనియర్లు ని అవమనపరుస్తున్నారు. ఎంపీ కేశినేని నాని పార్టీని అవమానపరిచిన వారికి ప్రాధాన్యం ఇచ్చి సీనియర్లని మోసం చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ గురించి రోడ్లు ఎక్కి తాము అనేక కార్యక్రమాలు చేసాం,,ఏనాడు నాని పార్టీ గురించి పోరాడలేదు. చంద్రబాబు ఇంటి మీద దాడి జరిగినప్పుడు కూడా నాని స్పందించలేదు. టీడీపీ అధిష్టానానికి సీనియర్ల ఆవేదన తెలియ చేయాలనే బయటకు వచ్చాము. చంద్రబాబు,,అచ్చెన్నాయుడు విజయవాడలో పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలి. టీడీపీ ని దగా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

## ఎయిడెడ్ స్కూళ్ల విలీనం వద్దు

విశాఖపట్నం అక్టోబరు 30 (న్యూస్ పల్స్) రాష్ట్ర వ్యాప్తంగా వున్న 1900 ఎయిడెడ్ పాఠశాలలు ఆస్తుల ను దోచేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రయత్నం చేస్తున్నారని, తక్షణమే జీవో నెంబర్ 42ని రద్దుచేసి ఎయిడెడ్ పాఠశాలలు ను యధావిధిగా కొనసాగించాలనీ టీడీపీ నాయకులు పల్లా శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణ బాబు డిమాండ్ చేశారు. ఎయిడెడ్ పాఠశాలలు విలీనం ప్రతిపాదన ను నిరసిస్తూ టీడీపీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వున్న అన్ని ప్రభుత్వ ఆస్తులు, కార్యాలయాలు ఇప్పటికే తాకట్టు పెట్టేశారని, ఇప్పుడు 107 ఎయిడెడ్ పాఠశాలలు పై జగన్మోహనరెడ్డి కన్ను పడిందని మండి పడ్డారు. అతిరద మహారదులు లో అధిక శాతం మంది మిషనరీ పాఠశాలలు లో చదివే ప్రయోజకులయ్యారని గుర్తు చేశారు. పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని సూచించారు. ఇప్పటికైనా స్థానిక వైసీపీ నాయకులు, ప్రజలు ప్రభుత్వ విదానాలను వ్యతిరేకించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## దొంగ ఓట్లతో గెలిచేది.. ఓ గెలుపేనా ?

కడపఅక్టోబరు 30 (న్యూస్ పల్స్) బద్వేల్ లో పోలీసులకు, వైకాపా కార్యకర్తలకు పెద్ద తేడా ఏమీ లేదని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్,విష్ణువర్ధన్ రెడ్డి వ్యాఖ్యానించారు. వైసీపీ కార్యకర్తల కంటే ఘోరంగా పోలీసులువైసిపి పార్టీకి సహకరిస్తున్నారు. నాడు తిరుపతి ఉప ఎన్నికల్లో ఏ రకంగా దొంగ ఓట్లు వేశారో దాన్నే బద్వేలులో పునరావృతం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే గోవిందరెడ్డిని హౌస్ అరెస్టు చేయాలి. దొంగ ఓట్లతో గెలిచేది.. ఓ గెలుపేనా ? పోలీసులులే దొంగ ఓట్లను ప్రోత్సహించడం సిగ్గుచేటు. మాజీ ఎమ్మెల్సీ గోవిందరెడ్డిని ఎందుకు అన్ని మండలాల్లో తిరగడానికి పోలీసులు అనుమతిస్తున్నారని ప్రశ్నించారు.

### ఎమ్మిగనూరు మండల గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టండి

ఎమ్మిగనూరు అక్టోబరు 30 (న్యూస్ పల్స్) మండల పరిధిలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలుగొట్ల గ్రామంలో రాస్తారోకో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజీవ్ పాల్గొని మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండలంలో ఉన్న అన్ని గ్రామాలలో రోడ్లు లేక ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారు పారిశుద్ధ్య పనులు జరగడం లేదు అభివృద్ధి పనులు జరగడం లేదు అలాగే కలుగొట్ల గ్రామంలో దాదాపు 12 సంవత్సరాల నుంచి సిసి రోడ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు పంచాయతీ ఎలక్షన్ల ముందు సర్పంచులు హామీలు ఇస్తారు

# నంద్యాల పురపాలక సంఘాన్ని అభివృద్ధి వైపు నడిపిద్దాం

## అమృత్ పథకం ద్వారా 66 కోట్ల రూపాయలు రుణం మంజూరు

## త్రాగునీటి సమస్య కు త్వరలో స్వస్తి పలకుదాం .నంద్యాల పురపాలక సంఘ చైర్మన్ షేక్ మాబున్నిషా

నంద్యాల అక్టోబర్ 30 ( విభారె) నంద్యాల పురపాలక సంఘాన్ని అభివృద్ధి వైపు నడిపిద్దాం అని నంద్యాల పురపాలక సంఘ చైర్మన్ షేక్ మాబున్నిషా అన్నారు. శనివారం నంద్యాల మునిసిపల్ కౌన్సిల్ సమీక్ష సమావేశ భవనంలో నంద్యాల పురపాలక సంఘ చైర్మన్. షేక్ మాబున్నిషా.నంద్యాల పురపాలక సంఘ వైస్ చైర్మన్ లు గంగిశెట్టి నాగ వెంకట శ్రీధర్. పాంషావలి .లతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు.సమీక్షా సమావేశంలో పురపాలక సంఘం కమిషనర్ వెంకట కృష్ణ . ఇంజనీర్లు విజయ భారతి రెడ్డి. మధు. మున్సిపల్ కార్యాలయ సిబ్బంది మున్సిపల్ కోఆప్షన్ మెంబర్లు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. నంద్యాల పురపాలక సంఘ చైర్మన్ షేక్ మాబునిషా మాట్లాడుతూ త్రాగునీటి సమస్యకు స్వస్తి పలకడానికి గాను మన నంద్యాల శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి చొరవతో అమృత్ పథకం ద్వారా 66 కోట్ల రూపాయలు రుణం మంజూరు చేయించారని తెలిపారు. అందులో నంద్యాల నందు త్రాగునీటి సమస్యకు సంబంధించి పనులు నిర్వహిస్తున్న గుత్తేదారులకు 18 కోట్ల రూపాయల ను కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. వచ్చే ఎండాకాలంలోగ త్రాగునీటి సమస్య ఉండకుండా ఉండుట కొరకు గుత్తేదారులకు పనులను వేగవంతంగా నిర్వహించాలని తెలియజేశామన్నారు. శనివారం నాడు జరిగిన సమావేశంఅజండా లో రెండు అంశాలు తప్ప అన్నిటికీ ఆమోదముద్ర వేయడం జరిగింది అన్నారు. .ఈరోజు జరిగిన సమావేశంలో కొంతమంది కౌన్సిలర్లు పున్న రాజేశ్వరి. జై నాభి. అబ్దుల్ మజీద్ .వెంకటలక్ష్మి శ్యామ్ సుందర్ లాల్. శ్రీదేవి శిల్పా నాగినిరెడ్డి. దేశం సులోచన. కో ఆప్షన్ మెంబర్. సుబ్రమణ్యం. తదితరులు మాట్లాడుతూ మన నంద్యాల పట్టణంలో ఎన్నో సంవత్సరంల నుండి ఏయిడెడ్ పాఠశాలల ద్వారా నంద్యాల లోని విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నామని ప్రభుత్వం ప్రస్తుతం ఈ ఏయి డెడ్ పాఠశాలలను విలీనం చేస్తోందన్నారు. నంద్యాల పట్టణంలో అన్ని పాఠశాలలను విలీనం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనకు కూడా ఉందన్నారు. .34 వ వార్డు కౌన్సిలర్ మహబూబ్ అలీ మాట్లాడుతూ .పట్టణంలో మురుగు కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఎందుకంటే ప్రస్తుత పరిస్థితుల్లో డెంగ్యూ .కోవిడ్ వ్యాధులు ప్రబలుతూనే ఉన్నాయి వీటి పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంకా కొంత మంది కౌన్సిలర్లు మాట్లాడుతూ నంద్యాల పురపాలక సంఘం లో పారిశుధ్య కార్మికులను ఇంకా అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణంలో ఉదయం .సాయంకాల.సమయంలో ఫాగింగ్ చేయించాలని కోరినారు. నంద్యాల పట్టణంలో కొన్ని వార్డుల్లో రెండు రోజులకు ఒకసారి త్రాగు నీటిని వదులుతున్నారు అని అలా కాకుండా ప్రతిరోజు త్రాగునీటిని రాత్రి పూట కాకుండా పగటి పూట నేత్రాగు నీటిని వదలాలి అన్నారు. కొన్ని వార్డులలో కరెంటు స్తంభాలు సరిగా లేవని కరెంటు వైర్లు పూర్తిగా కిందికి వేలాడుతున్నాయని వాటిని సరి చేయించాలని 39 వ వార్డు లో ఉన్న పాఠశాలకు మౌలిక వసతులు ఏర్పాటు చేయించాలని నంద్యాల పట్టణంలోని ఎన్టీఆర్ కాంప్లెక్స్ ను అధునాతనంగా తీర్చిదిద్ది మున్సిపాలిటీకి ఆదాయం పెరిగేల చూడాలన్నారు. 12వ వార్డు లో మెటల్ రోడ్లు ఉన్నాయని. లాలీ కాలువలు కూడా ఏర్పాటు చేయించాలని పారిశుధ్య సిబ్బంది చే రోడ్లను శుభ్రం చేయించాలని వార్డులో కోతుల బెడద. కుక్కల బెడద ఎక్కువగా ఉన్నది వాటిపై కూడా దృష్టి సారించాలని కోరారు . ఒకటో వార్డు లో సచివాలయ సేవలు సరిగా అందడం లేదని సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు అందించాలని 27వ వార్డులో వీధి దీపాలు సరిగ్గా వెలుగడం లేదు వాటిని సరి చేయించాలని కౌన్సిలర్ లు కోరినారు. అదేవిధంగా సంబంధిత అధికారుల తో మాట్లాడి వీలైనంత త్వరలో పరిష్కారం చేస్తామని ఆమె అన్నారు.

# ప్రతి జిల్లాకి ఒక బూతు మంత్రిని నియమించిన వైసీపీ ప్రభుత్వం

## - ప్రధాన కార్యదర్శి చిలకం మదుసూదన రెడ్డి

నెల్లూరు అక్టోబర్ 30 ( విభారె) నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల విడుదల చేయబోతున్న సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర కార్యాలయం నుంచి త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కమిటీ లో సభ్యులైన పార్టీ జనరల్ సెక్రటరీ చిలకం మధుసూదన రెడ్డి సెక్రటరీ లు విజయ్ శేఖర్ స్వరూపరాణి ,జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్ జిల్లా నుంచి నియేజకవర్గాల ఇన్ చార్జీలు నాయకులు,కార్యకర్తలతోఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి జిల్లాకి ఒక బూతు మంత్రిని ఏర్పాటుచేసిన వైకాపా ప్రభుత్వం అభివృద్ధిని గురించి ప్రశ్నించినప్పుడల్లా బూతులు తిడుతూ టాపిక్ డైవర్ట్ చేస్తారని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలపై పన్నుల భారం పెరిగి తల్లడిల్లుతున్నార అని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు కొత్త వన్నులతో అల్లాడుతున్నారని,రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందన్నారు.పాలకులు ప్రజల క్షేమం మరిచారని తెలిపారు.మహిళలకు రక్షణ లేద అని ఆవేదన వ్యక్తపరిచారు.ఎంతో ప్రమాదకరంగా ఉన్న ,సోమశిల డ్యామ్ ని పునరుద్ధరించే ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి లేదని ఆక్రోశం వెల్లడించారు.ఈ సమస్యలను దూరం చేయాలన్నా, పన్నుల భారం తగ్గించాలన్నా, అభివృద్ధి సాధించాలన్నా జనసేన పార్టీ అధికారం లోకి రావాల్సి ఉందన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన పార్టీ గెలుపే ధ్యేయంగా వ్యూహారచన జరుగుతుందన్నారు.పటిష్టమైన కార్యాచరణతో జనసేన పార్టీ కార్పొరేషన్ ఎన్నికల్లో సిద్ధమవుతుందని తెలిపారు.నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల పోటీ కై జనసేన అభ్యర్థుల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని తెలిపారు.ఎన్నికల పోటీ కై పోటీ పడి అభ్యర్థుల దరఖాస్తులు..54 డివిజన్ల కై 126 దరఖాస్తులు వచ్చాయన్నారు.అందరి దరఖాస్తులు స్వీకరించి ,స్క్రీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో అభ్యర్థుల పేర్లు

త్వరలో ప్రకటించబడతాయని తెలియజేశారు.ఈ సందర్భంగా ఏ అభ్యర్థికి అవకాశం వచ్చినా కార్యకర్తలందరూ గాజు గ్లాసు గెలుపే ధ్యేయంగా జనసేన పార్టీ తరపున ప్రచార కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల, నెల్లూరు నగర నాయకులు దుగ్గిశెట్టి సుజయ్ బాబు, రాష్ట్ర కార్యక్రమాల కమిటీ కార్యదర్శి కొట్టే వెంకటేశ్వర్లు , ఉపాధ్యక్షులు సుధీర్ బద్దిపూడి, ప్రధాన కార్యదర్శులు ×గూడూరు వెంకటేశ్వర్లు , ప్రవీణ్ కుమార్ యాదవ్, మున్వర్ భాష, కార్యదర్శి పసుపులేటి సుకన్య,,సంయుక్త కార్యదర్శి షన్వాజ్ , యజ్ఞేశ్ సింగ్, అనిల్ ,తదితర నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు, జనసైనికులు, పాల్గొన్నారు.

# రొమ్ము క్యాన్సర్ పై కరపత్రాల పంపిణీ, ర్యాలీ నిర్వహణ...

కడప అక్టోబర్ 30 ( విభారె):దేశంలో 80 శాతం మంది మహిళలు రొమ్ము క్యాన్సర్ మూడో లేదా నాల్గవ దశలో కానీ డాక్టర్ల వద్దకు వెళ్ళడం లేదని తద్వారా మరణాలకు చేరువవుతున్నారని రొమ్ము క్యాన్సర్ ను మొదటి దశ లోనే నిర్ధారించుకుని తగిన చికిత్స చేయించు కోవటం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చు నని ఫాతిమా వైద్య కళాశాల వారి పట్టణ ఆరోగ్య శిక్షణా కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బెనజీర్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అక్టోబర్ మాసమును రొమ్ము క్యాన్సర్ అవగాహనా మాసంగా ప్రకటించిన దరిమిల ఫాతిమా వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం వారు క్యాన్సర్ పైన పూర్తి సమాచారం తో రూపొందించిన కరపత్రాలను స్థానిక అక్కాయపల్లి లోని ఫిమ్స్ పట్టణ ఆరోగ్య శిక్షణా కేంద్రం పరిసరాలలో ఈ నెల 30 వ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బెనజీర్ మాట్లాడుతూ మన భారతదేశం లో సంవత్సరానికి దాదాపు 20-30 వేల మరణాలకు కారణమవుతూ, నిన్నటి సమాజాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన గర్భాశయ క్యాన్సర్ లను అధికమిస్తూ నేడు రొమ్ము క్యాన్సర్ల ప్రభావం చాలామంది స్త్రీల పైన పడి జీవితాలను అతలాకుతలం చేస్తూవున్నాయి అని ఈ రొమ్ము క్యాన్సర్ పైన ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ బెనజీర్ కోరారు. తదనంతరం అక్కాయపల్లి పరిసర ప్రాంతాల్లో రొమ్ము క్యాన్సర్ పై అవగాహన ర్యాలీ ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ మెడికల్ సోషియల్ వర్కర్ సుబ్రమణ్యం జూనియర్ వైద్యులు అర్బాజ్, మేఘనాయుడు, నిశ్చల, జియా ఉల్ హక్, మనీషా, మన్నా మనాల్, రుక్సనా, అష్రఫ్, షాహిద్, ఉమర్, జువెరియా 2018 మరియు 2019 సంవత్సరపు వైద్య విద్యార్థులు మరియు సిబ్బంది రమాదేవి, ధనలక్ష్మి, పుష్పలత, తహసీన్,. శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ముస్లిం సమస్యలు పరిష్కరించాలి

## టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్

నంద్యాల చిత్తూరు జిల్లా కుప్పం లో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని మర్యాదపూర్వకంగా టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ కలవడం జరిగిందన్నారు . అనంతరం టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ గారు మాజీ ముఖ్యమంత్రి గారితో రాష్ట్రంలోని ముస్లిం సమస్యలపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా మౌలానా ముస్తాక్ అహ్మద్మాట్లాడుతూసీఎం జగన్ మోహన్ రెడ్డి మూడేళ్లలో ప్రజలకు చేసింది ఏమీ లేదు వారు ఆరోపించారు.ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ముస్లిం మైనార్టీలకు చెందిన దుల్హన్ పథకం కింద అర్హులైన వారికి ఒక లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చి మూడు నెలలవుతోంది ఈ పథకం ఏమైంది ముఖ్యమంత్రి గారు అంటూ తెలుగుదేశం పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి అధికారం చేపట్టి మూడేళ్ల అవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆయన విమర్శించారు . కేవలం పథకాల పేరుతో చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు . వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలందరూ పలు కష్ట కష్టాలను ఎదుర్కొంటు వారు తెలిపారు., ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రజలపై మోయలేని భారాన్ని మోపారని ఆరోపించారు . రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం చెత్తపై పన్ను విధించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు . పెరిగిన నిత్యావసర ధరలతో ప్రజల జీవితాలు ఆటుపోట్ల పాలవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు . రాబోయే రోజుల్లో వైయస్సార్సీపి ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్తారని మౌలానా ముస్తాక్ అహ్మద్ తెలిపారు.

## బాణాసంచా అమ్మకాలపై ఆర్డీవో సమీక్ష

మచిలీపట్నంఅక్టోబర్ 30, దీపావళి బాణా సంచా విక్రయ స్టాల్స్ అనుమతులపై పోలీస్, తహసీల్దార్లు, అగ్నిమాపక అధికారులతో స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బందర్ రెవెన్యూ డివిజన్ స్థాయి సమావేశం ఆర్డీఓ ఖాజావలీ నిర్వహించారు. స్టాల్స్ ఏర్పాటులో తీసుకోవల్సిన చర్యలను వివరించారు. నిబంధనల మేరకే స్టాల్స్ ఏర్పాటు చేయాలి స్టాల్స్ ఏర్పాటులో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, స్టాల్స్ ఏర్పాటు చేసుకునే వారు నవంబర్ 1వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డిఓ సూచించారు.

# గో మహా సమ్మేళనం “ లో విశేషంగా ఆకట్టుకుంటున్న పంచగవ్య ఉత్పత్తుల స్టాల్స్

తిరుపతి, అక్టోబర్ 30, తిరుపతి మహతి కళాక్షేత్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 24 గో ఆధారిత పంచగవ్య ఉత్పత్తుల స్టాల్స్ రైతులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. శనివారం టిటిడి ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఈవో డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి స్టాల్స్‌ను పరిశీలించి తయారీ వివరాలు, ఉపయోగాల గురించి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా టిటిడి ఆధ్వర్యంలో ఉత్పత్తి చేయబడుతున్న అగరబత్తులు, ఆయుర్వేద - పంచగవ్య ఉత్పత్తులు, టిటిడి ప్రచురణలు, డ్రై ఫ్లవర్ టెక్నాలజీతో తయారు చేసిన చిత్రపటాలను ఉంచారు.హైదరాబాద్‌కు చెందిన వజ్ర హెర్బల్ సౌందర్య ఉత్పత్తులు, ఎస్‌పిఎకో ఫ్యూయల్ ఫ్లెక్సి బయోగ్యాస్ ప్లాంట్, చెన్నైకి చెందిన శ్రీరామ్ హెర్బల్ బాత్ పౌడర్, ఆవునెయ్యితో తయారు చేసిన ఫేస్ క్రీమ్, గో మయంతో తయారు చేసిన, ప్రమిదలు, దూప్‌స్టిక్స్, పండ్లపొడి, బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు ఉన్నాయి. కర్నూల్ జిల్లా శ్రీ మహంకాళి దేవి గో సంరక్షణ శాల నిర్వహకులు శ్రీ చాంద్ బాష పంచగవ్యాలతో తయారు చేసిన పలు రకాల ఉత్పత్తులు ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన పల్లె సృజన వారు ఆకు పసురులతో తయారు చేసిన వరిలో కలుపు, తెగులు నివారించే మందులు, మొక్కల ఎదుగుదలకు ఉపయోగపడే పలు ఉత్పత్తులు ఉంచారు. చిత్తూరుకు చెందిన నిహారిక ఎద్దు గానుగతో ఆడించిన నూనెలైన వేరుశనగ, కొబ్బరి, నువ్వులు, కుసుమలు, వేప నూనెలు అందుబాటులో ఉంచారు. అనంతపురంకు చెందిన సంజీవని నేచురల్స్‌వారు చిరుధాన్యాలు, వంటనూనెలు, టూత్ పేస్టులు, విజయవాడకు చెందిన గణపతి మునగాకుపొడి, గోదుమగడ్డి పొడి, తిప్పతీగ చూర్ణం, అల్లం పొడి, పెయిన్ రిలీఫ్ ఆయిల్ ఉన్నాయి.

# ఓటీటీ సూపర్ స్టార్ కు మనసు విరిగిందట



బాలీవుడ్ ప్రముఖ నటుడు నవాజుద్దీన్ సిద్దిఖీ ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని నటుడు. అద్భుతమైన నటనతో ఎన్నో పాత్రలకు జీవం పోసిన గొప్ప నటుడు. సినిమాల్లోనే కాకుండా ఓటీటీ లో కూడా నవాజుద్దీన్ సిద్ధిఖీ నటనతో మెప్పించాడు. పలు వెబ్ సిరీస్ ల్లో నటించి మెప్పించిన నవాజుద్దీన్ సిద్ధఖీ సూపర్ సక్సెస్ నటుడిగా పేరు దక్కించుకున్నాడు. ఓటీటీ ల్లో పలు సూపర్ హిట్స్ ను దక్కించుకుని ఓటీటీ సూపర్ స్టార్ అంటూ కూడా అభిమానులతో పిలిపించుకున్నాడు. అలాంటి నవాజుద్దీన్ సిద్ధిఖీ నుండి ఇంకా పలు వెబ్ సిరీస్ లను అభిమానులు ఆశిస్తున్నారు. ఈ సమయంలో ఆయన తీసుకున్న నిర్ణయం అభిమానులకు షాకింగ్ గా ఉంది. ఇక మీదట ఓటీటీల్లో కనిపించేదే లేదు అంటూ తేల్చి చెప్పాడు.ఓటీటీలు అనేవి కొత్త వారికి మంచి అవకాశంను ఇస్తున్నాయి.. నటుడిగా వెబ్ సిరీస్ లు మంచి అవకాశాలను తెచ్చి పెడతాయని ఆశించాను. ఆరంభంలో ఓటీటీ కంటెంట్ అంటే చాలా అభిమానం ఉండేది. కాని ఇప్పుడు ఓటీటీ కంటెంట్ ముఖ్యంగా వెబ్ సిరీస్ లు అంటే అసహ్యం కలిగే విధంగా పరిస్థితి తయారు అయ్యిందంటూ నవాజుద్దీన్ సిద్దిఖీ వ్యాఖ్యలు చేశాడు. శాక్రెడ్ గేమ్స్ లో నటిస్తున్న సమయంలో వెబ్ సిరీస్ అంటే చాలా ఎగ్జైట్ మెంట్ ఉండేది. వెబ్ సిరీస్ లు అంటే అప్పట్లో చాలా గౌరవం ఉండేది. కాని ఇప్పుడు వెబ్ సిరీస్ లు బూతులా మారాయి. అడ్డమైన కంటెంట్ తో వెబ్ సిరీస్ లను చేస్తున్నారంటూ ఆయన అసహనం వ్యక్తం చేశాడు. ఓటీటీ లో ఈమధ్య కాలంలో అంతా కూడా బూతు కంటెంట్ ను చూపిస్తున్నారు. వెబ్ సిరీస్ అంటేనే బూతు అన్నట్లుగా జనాలు భావించే స్థితికి తీసుకు వచ్చారు.ఇలాంటి వెబ్ కంటెంట్ ను ఇస్తున్న ఓటీటీ ల్లో నేను కనిపించాలంటే అసహ్యంగా అనిపిస్తుంది. అందుకే ఇకపై వెబ్ సిరీస్ ల్లో కాని.. వెబ్ మూవీస్ ల్లో కాని నటించాలని అనుకోవడం లేదు. కేవలం సినిమాల్లో మాత్రమే నటిస్తాను. ముందు ముందు వెబ్ కంటెంట్ అంటే మరింతగా బూతు అయ్యే అవకాశం ఉందని.. ఇప్పటికి అయినా ఓటీటీలు కాస్త దృష్టి పెట్టాలన్నట్లుగా ఆయన అభిప్రాయం వ్యక్తం చేశాడు. బూతు కంటెంట్ లో నటించనక్కర్లేదు.. మంచి సబ్జెక్ట్ ఉన్న వెబ్ సిరీస్ ల్లో నటించవచ్చు కదా అంటూ అభిమానులు ఆయన్ను కోరుతున్నారు. ముందు ముందు అయినా నవాజుద్దీన్ సిద్దిఖీ తన నిర్ణయాన్ని మార్చుకుంటాడేమో చూడాలి. ప్రస్తుతం పలు బాలీవుడ్ సినిమాల్లో ఈయన నటిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పుడిప్పుడే బాలీవుడ్ స్టార్స్ ఓటీటీ కంటెంట్ పై ఆసక్తి చూపిస్తున్న సమయంలో నవాజుద్దీన్ సిద్దిఖీ దాని నుండి తప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది.

# టైట్ అందాలతో టాప్ లేపిన శర్మా సిస్టర్స్




శర్మా సిస్టర్స్ నేహా శర్మ - ఐషా శర్మ అల్ట్రా స్టైలిష్ అవతార్ ప్రతిసారీ చర్చకు వస్తూనే ఉంటుంది. ఈసారి కూడా డిజైనర్ లుక్ లో ‘ఆఫత్ ఇ-ఇష్క్‘ సినిమా ఈవెంట్ కు హాజరయ్యారు. నేహా మినీ రొంపర్ లు ధరించగా.. ఐషా బ్యాగీ జీన్స్ లో అదరగొట్టింది. ముగ్ధ మనోహరమైన రూపాలతో సిస్టర్స్ కళ్లన్నీ తమవైపే తిప్పేసుకున్నారు. టైట్ అందాలతో టాప్ లేపిన శర్మా సిస్టర్స్ గురించి ఈవెంట్ ఆద్యంతం యూత్ అదే పనిగా ముచ్చటించుకున్నారు. ఇక ఇటీవలే శర్మా సిస్టర్స్ ఏ వేదికకు వెళ్లినా అందాల విందుతో గమ్మత్తుగా మత్తు చల్లడం చర్చకు వస్తోంది. సోషల్ మీడియాల్లోనూ ఈ భామలు అస్సలు తగ్గడం లేదన్న టాక్ వినిపిస్తోంది.ఇక ఓ చాటింగ్ సెషన్ లో నేహా తనపై గతంలో జరిగిన ఓ ఆకృత్యం గురించి గుర్తు చేసుకుంది. తన అసభ్యకర మార్ఫింగ్ ఫోటో ఒకటి ఆన్ లైన్ లో షేర్ అయిన తర్వాత సెట్ లోని వ్యక్తులు తనతో విచిత్రంగా ప్రవర్తించారని నేహా శర్మ చెప్పారు. నేహా శర్మ కొన్ని సంవత్సరాల క్రితం వైరల్ అయిన తన మార్ఫింగ్ ఫోటో గురించి ఇప్పుడు మరోసారి గుర్తు చేసింది.మార్ఫింగ్ చేసిన ఫోటో చూసి మొదట్లో బాధపడ్డాను అని చెప్పింది. ఇంతకీ ఇది ఎలాంటి ఫోటోగ్రాఫ్ అంటే.. నేహా స్వయంగా ఆన్ లైన్ లో పోస్ట్ చేసిన సెల్ఫీని బ్యాక్ గ్రౌండ్ మార్చేసి సెక్స్ టాయ్ ని జోడించారు ఆకతాయిలు. అది చూసి మొదట్లో తాను చాలా బాధపడ్డా చివరికి శాంతించానని శర్మ గాళ్ చెప్పింది. ఒక ఇంటర్వ్యూలో నేహా తన వెబ్ సిరీస్ ‘ఇల్లీగల్‘ సెట్స్ పైకి వెళ్లినప్పుడు మారిన తన ఇమేజ్ గురించి తెలుసుకున్నానని అందరూ తనతో ‘వింతగా’ ప్రవర్తించారని చెప్పారు.నేహా ఇంకా మాట్లాడుతూ “డ్యూడ్ ఇది ఒక పిచ్చి. ఈ రకమైన మార్ఫింగ్ దుర్మార్గం. నేను నిస్సందేహంగా చిన్నపిల్లను కాబట్టి ఆ సమయంలో ఏం చేయాలో మెదడుకు తోచలేదు. ఎవరైనా ఇలా ఎందుకు చేస్తారు? ఈ బ××బి తో చెత్తపనులు చేసేందుకు జాబ్ లెస్ గా ఉన్నారేమిటీ?“ అంటూ సీరియస్ అయ్యారట.ఇల్లీగల్ సెట్స్ లో వైరల్ అయిన ఫోటో గురించి ఎవరో తనకు తెలియజేశారని నేహా తెలిపింది. ఆ ఫోటో గురించి ఏదీ నాకు అర్థం కాలేదు. నేను సెట్ కి వచ్చాను. అందరూ కాస్త విచిత్రంగా.. వింతగా ఉన్నారు. వాళ్ళు నాతో మాట్లాడలేదు. అందరూ చర్చించుకుంటున్నారు. గొణుగుడు వినిపించింది. నేను ఇలా ఉన్నాను. ఏం జరుగుతోంది? అందరూ ఎందుకు విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు? అనుకున్నాను. చివరికి ఎవరో నా దగ్గరకు వచ్చి ‘నేహా.. ఇదిగో నీ ఫోటో వైరల్ అవుతోంది’ అన్నారు.. ‘ఏం చిత్రం?’ అని నేను చూశాను నేనూ. నేను (షాక్ తో నోరు తెరిచి) వావ్! చాలా క్రియేటివ్గా ఉన్నాను. ఎవరు చేసారో.. అన్నాను. నేను మొదట్లో బాధపడ్డాను.. కానీ తర్వాత నేను.. అది సరే.. నిజం ఏమిటో నాకు తెలుసు. నాకు అవి నిజంగా అవసరం లేదు.. నన్ను సంతృప్తి పరచడానికి..!“ అని బహిరంగంగా చెప్పాను.. అని తెలిపారు నేహా. తన చిత్రాన్ని డిజిటల్ గా మార్ఫింగ్ చేసిన వ్యక్తిని నేహా తిట్టేసిందట. మనుషులు ఎంత స్త్రీద్వేషిగా ఉంటారనేది విచారకరం... ఫోటోలను మార్ఫింగ్ చేయడం.. దాని నుండి చౌకగా థ్రిల్స్ పొందడం మానేయండి..అంటూ క్లాస్ తీస్కుంది. ఇది అసలు ఫోటో అంటూ ఒరిజినల్ ని చూపించింది.2010లో ఇమ్రాన్ హష్మీ సరసన క్రూక్ చిత్రంతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టిన నేహా... క్యా సూపర్ కూల్ హై హమ్.. యమ్లా పగ్లా దీవానా 2.. యంగిస్తాన్ ..తాన్హాజీ: ది అన్సంగ్ వారియర్ వంటి చిత్రాలలో నటించింది. ప్రస్తుతం తన సోదరి ఐషా శర్మ కెరీర్ ని షేపప్ చేసేందుకు తీవ్రంగానే శ్రమిస్తోంది.

# ఎన్టీఆర్ డిజాస్టర్ సినిమాని రీమేక్ చేసి బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన పునీత్..!

కన్నడ పవర్ స్టార్ పునీత్ రాజ్ కుమార్ శుక్రవారం హఠాత్మరణం చెందారు. జిమ్ లో వర్కౌట్స్ చేస్తుండగా ఆకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఆయన్ని ఆస్పత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు 46 ఏళ్ల అప్పూ. పునీత్ మరణ వార్తతో సినీ ఇండస్ట్రీ తీవ్ర విషాదంలో మునిగిపోయింది. అభిమానులందరూ పవర్ స్టార్ మరణించారనే వార్త జీర్ణించుకోలేక పోతున్నారు. టాలీవుడ్ ప్రముఖులు కూడా పునీత్ మృతికి సంతాపం ప్రకటించారు.తెలుగు చిత్ర పరిశ్రమతో పునీత్ రాజ్ కుమార్ కు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. టాలీవుడ్ డైరెక్టర్ చేతుల మీదుగా హీరోగా లాంచ్ చేయబడిన పునీత్.. ఎన్నో తెలుగు సినిమాలను కన్నడలో రీమేక్ చేసి హిట్స్ అందుకున్నారు. అయితే ఎవరూ ఊహించని విధంగా తెలుగులో డిజాస్టర్ అయిన “ఆంధ్రావాలా” సినిమాతో కూడా సక్సెస్ అందుకుని ఆశ్చర్యపరిచాడు. ఎన్టీఆర్ హీరోగా పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఎలాంటి ఫలితం అందుకుందో తెలిసిందే. అలాంటి కథను కన్నడలో ‘వీర కన్నడి’ అనే పేరుతో రీమేక్ చేశారు.ాలీవుడ్ దర్శకుడు మెహర్ రమేష్ ‘వీర కన్నడి’ చిత్రానికి దర్శకత్వం వహించారు. 2004లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ఘనవిజయం సాధించింది. ఒక భాషలో ఫ్లాప్ అయిన కథను రీమేక్ చేయడం సాహసమే అనుకోవాలి. అందుకే ఆ సినిమా సక్సెస్ అవుతుందని ఎవరూ ఊహించలేదు. కానీ మెహర్ - పునీత్ ఇద్దరూ కలిసి అందరి అంచనాలను తలక్రిందులు చేశారు. ఇందులో తండ్రీ కొడుకుగా రెండు పాత్రల్లో పునీత్ రాజ్ కుమార్ మెప్పించారు. ఇలా పూరీ అందించిన రెండు కథలతోనూ ఆయన హిట్స్ అందుకున్నారు.'ఆంధ్రావాలా' రీమేక్ తరువాత పునీత్ రాజ్ కుమార్ - మెహర్ రమేష్ కలిసి ‘ఒక్కడు’ చిత్రాన్ని రీమేక్ చేసి సూపర్ హిట్ అందుకున్నారు. అలానే ‘అమ్మా నాన్న ఓ తమిళమ్మాయి’ ‘రెడీ’ ‘దూకుడు’ వంటి తెలుగు సినిమాలను ఆయన రీమేక్ చేసి కన్నడ ప్రేక్షకులను అలరించారు. ఇదే క్రమంలో కన్నడలో తన స్థాయిని పెంచుకుంటూ వచ్చారు. పునీత్ చివరిగా నటించిన ‘యువరత్న’ సినిమాని డబ్ చేసి తెలుగు సినిమాలకు పోటీగా భారీగా విడుదల చేశారు. ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ లో కూడా పునీత్ పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గర అవుతారని భావిస్తున్న తరుణంలో హఠాత్మరణం చెంది ఈ లోకాన్ని విడిచారు.

# ఆఫ్రిదికి సెల్యూట్ చేసిన మాలిక్.. ఎందుకో తెలుసా..!



టీ20 ప్రపంచకప్2021లో భాగంగా శుక్రవారం ఆఫ్గానిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో పాకిస్తాన్ విజయం సాధించింది. దీంతో సెమిఫైనల్‌కు అడుగు దూరంలో నిలిచింది పాకిస్తాన్. అయితే ఈ మ్యాచ్ అనంతరం ఓ ఆసక్తి?కర సన్నివేశం చోటు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తమ జట్టును సపోర్ట్ చేయడానికి వచ్చిన పాక్ మాజీ ఆటగాడు షాహిద్ అఫ్రిదినూ చూస్తూ.. షోయబ్ మాలిక్ సెల్యూట్ చేశాడు. దీంతో స్టేడియంలో ఉన్న అభిమానులందరూ ఆశ్చర్యానికి గురైయ్యారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియోను పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ట్విటర్‌లో షేర్ చేసింది.అయితే ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా 2018లో అంతర్జాతీయ క్రికెట్ వీడ్కోలు పలికిన ఆఫ్రిది.. ప్రస్తుతం దేశవాళీ టోర్నీల్లో ఆడుతున్నాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 147 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో పాక్ ఆరంభంలోనే రిజ్వాన్ (8) వికెట్‌ను కోల్పోయింది.అయితే బాబర్, ఫఖర్ కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. అయితే తక్కువ వ్యవధిలో ఫఖర్‌తో పాటు హఫీజ్ (10) కూడా నిష్క్రమించాడు. బాబర్‌ను రషీద్ అవుట్ చేయడంతో ఉత్కంఠ పెరిగింది. 18వ ఓవర్లో నవీన్ ఉల్ హఖ్ 2 పరుగులే ఇచ్చి మాలిక్ (19) వికెట్ తీయడంతో అఫ్గాన్ గెలుపుపై ఆశలు పెంచుకుంది. అయితే ఆసిఫ్ తన మెరుపు బ్యాటింగ్‌తో పాక్‌ను గెలిపించాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190